# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | గురువారం-29- మే - 2025 | సంపుటి : 3 | సంచిక : 3 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# కులవృత్తుల పేరుతో బీఆర్ఎస్ మోసం



- యువతకు సీఎం రేవంత్ హితబోధ
- 15–25 ఏళ్ల వయసు అత్యంత కీలకం
- కెరీర్‌పై దృష్టి సారించాలి
- క్రమశిక్షణతో ఉన్నవారే స్థిరపడతారు
- ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో సీఎం పాల్గొనడం
- ఐఐటీ, ఎన్ఐటీ, మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు
- పదోతరగతిలో 100% ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు రూ.5 లక్షల చెక్కులు
- ఉత్తమ మార్కులు సాధించిన ఇంటర్, 10వ తరగతి విద్యార్థులకు బహుమతులు
- కార్పొరేట్ స్థాయిలో గురుకులాలు – యువతకు మెరుగైన భవిష్యత్తు
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభం
- ఒక్కో స్కూల్‌కి రూ.200 కోట్లు వ్యయం
- రాష్ట్రవ్యాప్తంగా రూ.25 వేల కోట్లు పెట్టుబడి
- విద్యతోనే అవకాశాలు – కులాలతో కాదు
- కులవృత్తుల పేరుతో బీఆర్ఎస్ మోసం
- బర్రెలు, గొర్రెలతో ఉపహాసంగా పథకాలు
- కష్టపడి చదివినవారికి మాత్రమే ఉద్యోగ అవకాశాలు

**హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)**

పాతికేళ్లు వచ్చే వరకు కష్టపడిన ప్రతి వ్యక్తి జీవితంలో స్థిరపడతారని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. ప్రతి మనిషికి మొదటి పాతిక సంవత్సరాలు ముఖ్య కాలమని, అందులోనూ 15 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు అత్యంత కీలకమైనదని తెలిపారు. ఈ సమయంలో క్రమశిక్షణతో, నిబద్ధతతో ఉండాలని సూచించారు. రంగుల ప్రపంచానికి ఆకర్షితులు కాకుండా కెరీర్‌పై దృష్టి సారిస్తేనే జీవితంలో మంచి స్థానానికి చేరుకుంటారని విద్యార్థులకు హితబోధ చేశారు.

బుధవారం బంజారాహిల్స్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ నిర్వహించిన 2024-25 ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐఐటీలు, ఎన్ఐటీలు, మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించిన గురుకుల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు బహూకరించారు. గురుకులాల్లో ఇంటర్మీడియట్, పదోతరగతి చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

మిగతా 2లో..

# మేడిగడ్డ బరాజ్‌పై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక బూటకం: కేటీఆర్



- నివేదికను ఎల్అండ్‌టీ తిరస్కరించిందన్న ఆరోపణ
- నాణ్యతలేని నివేదికలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడంపై విమర్శ
- రైతులకు రేవంత్ క్షమాపణ చెప్పాలి: డిమాండ్
- ఏడాదిన్నరగా పంటలు ఎండిపోవడంపై ఆవేదన
- 500మందికి పైగా రైతుల ఆత్మహత్యలకూ కారణమన్న ఆరోపణ
- కాంగ్రెస్ – బీజేపీపై చిల్లర రాజకీయాల ఆరోపణ
- కాళేశ్వరం ప్రాజెక్టును అపవాదించేందుకు కుట్రలు
- పాలకుల అసమర్థత వల్ల రాష్ట్రానికి నష్టం
- లండన్ నుంచి కేటీఆర్ ప్రకటన
- యూకేలో బీఆర్ఎస్ రజతోత్సవాల ప్రకటన
- డాలస్‌లో జూన్ 1న సిల్వర్ జూబ్లీ వేడుకలు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- తెలంగాణలో ప్రభుత్వ దుర్వ్యవహారాలపై విమర్శలు
- యూకేలోని ఎన్ఆర్ఐ నేతలతో సమావేశం

**హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)**

కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్ విషయంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చేసిన వాదనలు తప్పులతడక అని తేలిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు తరహాలో మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించాలన్నారు. నాణ్యత లేనిది కాళేశ్వరం ప్రాజెక్టులో కాదని, కాంగ్రెస్, బీజేపీలే చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు.

కనీస నాణ్యత పరీక్షలు చేయకుండా, శాస్త్రీయడేటాను సేకరించకుండా ఎన్‌డీఎస్ఏ రూపొందించిన నివేదికను ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ తిరస్కరించడమే దీనికి సాక్ష్యమని పేర్కొన్నారు. లండన్ పర్యటనలో ఉన్న కేటీఆర్ ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్‌ను బదనాం చేసేందుకు, పార్టీని దెబ్బతీసేందుకు ఎన్‌డీఎస్ఏ ఈ నివేదిక ఇచ్చిందని మండిపడ్డారు.

**ఎన్‌డీఎస్‌ఏ నివేదిక బూటకం**

ఎల్అండ్‌టీ తాజా ప్రకటనతో మేడిగడ్డ బరాజ్‌పై ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన నివేదిక బూటకమని బయట పడిందని కేటీఆర్ అన్నారు.

మిగతా 2లో..

# నైరుతి రుతుపవనాల దూకుడు

- రెండు రోజుల్లోనే రాష్ట్రం మొత్తం విస్తరించిన నైరుతి రుతుపవనాలు
- వచ్చే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి భారీ వర్షా లు
- వర్షా ల చట్రంలో ఎక్కువ జిల్లాలు, మోస్తరు వర్షా లు సాధారణం
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్ష సూచన
- జూన్‌లో అధిక వర్షపాతం నమోదు కావచ్చని అంచనా
- సగటు వర్షపాతంతో పోలిస్తే 111% వర్షా లు కురిసే సూచనలు
- గతేడాదితో పోలిస్తే వర్షపాతం మరింత ఎక్కువగా ఉండే అవకాశాలు
- గతేడాది 23% అధిక వర్షా లు; ఈసారి అంతకంటే అధికం?
- జిల్లాలవారీగా వర్షపాతం వివరాలు
- ఉట్నూర్ (4.88 సెంటీమీటర్లు)లో అత్యధిక వర్షం నమోదు



**హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)**

నైరుతి రుతుపవనాలు అత్యంత చురుకుగా కదులుతున్నాయి. ఈనెల 26న రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించగా... బుధవారం సాయంత్రానికి తెలంగాణ అంతటా విస్తరించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించిన నాలుగు నుంచి ఆరు రోజుల వ్యవధిలో రాష్ట్ర భూభాగం అంతటా విస్తరించేవి.

మిగతా 2లో..

# జూన్ 5న కమిషన్ ఎదుట హాజరు కాబోతున్న కేసీఆర్

- వాదనలు సిద్ధం చేసుకునేందుకు బీఆర్ఎస్ లోపల కసరత్తులు ప్రారంభం
- కేసీఆర్‌తో హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి భేటీ
- విచారణకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘ చర్చ
- మేడిగడ్డ బరాజ్, కాళేశ్వరం డాక్యుమెంట్ల సమీకరణ
- కమిషన్‌కు సమగ్ర నివేదిక అందజేయాలని కేసీఆర్ ఆదేశాలు
- ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై వ్యతిరేకత
- ఎల్ అండ్ టీ అభిప్రాయాలను ఆధారంగా చూపించనున్న బీఆర్ఎస్
- గోదావరి విషయంలో ఉమ్మడి పాలకుల నిర్లక్ష్యం చర్చలో
- నదీ నీటి పంచాయితీపై రాజకీయ దృష్టికోణం
- విచారణకు సమయం ఇవ్వాలని కమిషన్‌ను కోరనున్న బీఆర్ఎస్
- తగిన సమయం లభించకపోతే ప్రత్యామ్నాయ చర్యలపై చర్చ
- కమిషన్‌కు ముందు పీపీ ప్రజెంటేషన్
- మీడియా ముందే ప్రాజెక్ట్ స్థితిగతులపై వివరాలు వెల్లడి

**హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)**



కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు జూన్ 5న హాజరు కావాలని నిర్ణయించుకున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె. చంద్రశేఖర్‌రావు.. ఆ మేరకు కసరత్తు ప్రారంభించారు. బుధవారం కేసీఆర్ ఎర్రవల్లి నివాసంలో ఆయనతో మాజీ మంత్రి హరీశ్‌రావు సుదీర్ఘంగా భేటీ అయ్యారు. మరో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మిగతా 2లో..



# రాబోయే ఐదేళ్లూ భగభగలే!

**న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)**

కర్బన ఉద్గారాలు, వాతావరణ మార్పుల ధాటికి భూగోళంపై ఉష్ణోగ్రతలు నానాటికీ పెరిగిపోతున్నాయి. వాతవరణ మార్పులను కట్టడి చేసేందుకు చేపడుతున్న చర్యలేవీ ఆశించిన ఫలితాలిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఉష్ణోగ్రతల పెరుగుదలను పారిశ్రామికవిప్లవం కంటే ముందున్న స్థాయికి తగ్గించాలన్న లక్ష్యాలు నెరవేరడం లేదు.

అభివృద్ధి చెందిన, పారిశ్రామిక దేశాల నిర్వాకం వల్ల ఈ లక్ష్యాలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. దిద్దుబాటు చర్యలు చేపట్టకుండా పరిస్థితి ఇలాగే కొనసాగితే భూగోళం మరింత వేడెక్కడం ఖాయమని ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ) తోపాటు యునైటెడ్ కింగ్‌డమ్ వాతావరణ కార్యాలయం హెచ్చరించాయి. ఈ మేరకు బుధవారం ఒక నివేదిక విడుదల చేశాయి.

ఉష్ణోగ్రతలు పారిశ్రామిక యుగానికి ముందున్న ఉష్ణోగ్రతల కంటే 2025 నుంచి 2029 వరకు ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెల్సియస్‌కుపైగా అధికంగా నమోదు కావడానికి 70 శాతం అవకాశాలు ఉన్నాయని డబ్ల్యూఎంఓ తేల్చిచెప్పింది.

రాబోయే ఐదేళ్లలో కనీసం ఒక సంవత్సరం అత్యధిక వేడి కలిగిన సంవత్సరంగా రికార్డుకు ఎక్కడానికి 80 శాతం అవకాశాలు ఉన్నట్లు స్పష్టంచేసింది. 2024 సంవత్సరం అత్యధిక వేడి సంవత్సరంగా రికార్డుకెక్కింది. రాబోయే ఐదేళ్లలో ఈ రికార్డు బద్ధలు కానున్నట్లు డబ్ల్యూఎంఓ అంచనా వేసింది. 1850-1900 నాటి సగటు ఉష్ణోగ్రతల కంటే 2024లో 1.5 డిగ్రీలకుపైగా అధిక ఉష్ణోగ్రత నమోదయ్యింది.

# హైకోర్టు సీజేగా జస్టిస్ ఏకే సింగ్!

- జస్టిస్ ఏకే సింగ్ ప్రొఫైల్
- పట్నా నుండి త్రిపుర వరకు ఆయన న్యాయ సేవా ప్రయాణం
- తెలంగాణ హైకోర్టులో కొత్త సీజేకు అవకాశం
- జస్టిస్ అలోక్ అరాధే బదిలీ తర్వాత ఖాళీగా ఉన్న పదవి
- సుజోయ్‌పాల్‌కు బదిలీ సిఫార్సు
- తాత్కాలిక సీజేగా ఉన్న ఆయనను కలకత్తా హైకోర్టుకు పంపేందుకు సిఫార్సు



**హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)**

దేశంలోని నాలుగు హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌ను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్రానికి సిఫార్సు చేసింది. ఈ నెల 26న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన కొలీజియం ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచింది.

జస్టిస్ ఏకే సింగ్ బదిలీకి కేంద్రం ఆమోదముద్ర వేస్తే ఆయన తెలంగాణ హైకోర్టు ఏడో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపడతారు. 1965, జూలై 7న జస్టిస్ ఏకే సింగ్ జన్మించారు. బీఏ ఆనర్స్ తర్వాత ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. 1990లో పట్నా హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2000 వరకు అక్కడ న్యాయవాదిగా పనిచేసి.. 2001లో జార్ఖండ్ హైకోర్టుకు మారారు.

మిగతా 2లో..





# కులవృత్తుల పేరుతో బీఆర్ఎస్ మోసం

(మొదటి పేజీ తరువాయి)

పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు రూ.5 లక్షల చొప్పున చెక్కులు బహూకరించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా గురుకులాలను తయారు చేస్తున్నామని చెప్పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతామని తెలిపారు. ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తామని వెల్లడించారు. యంగ్ ఇండియా తన బ్రాండ్ అని, గురుకుల విద్యార్థులే తన బ్రాండ్ అంబాసిడర్లు అని పేర్కొన్నారు.

**కులవృత్తుల పేరుతో బీఆర్ఎస్ మోసం**

కులం పేరుతో ఎవరికీ అవకాశాలు రావని, కష్టపడి చదువుకున్న వాళ్లకు మాత్రమే అవకాశాలు వస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువు వల్ల వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు కులవృత్తుల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. 'తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక పేదలు, బడుగుల జీవితాలు మారుతాయని అందరూ భావించారు.

కానీ పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ అన్ని వర్గాలను అణిచివేసింది. చదువుకుంటే ఉద్యోగాలు వస్తాయని తెలిసినప్పటికీ.. మెరుగైన విద్య అందించకుండా కులవృత్తులు చేసుకోవాలని.. బర్రెలు, గొర్రెలు కాయాలంటూ వాటిని పంపిణీ చేసి చేతులు దులుపుకుంది. కష్టపడి చదువుకున్న వాళ్లు ప్రభుత్వ కొలువుల కోసం ఏళ్లపాటు నిరీక్షించారు. కానీ, గత పాలకుడి ఇంట్లో ఒక్క మనిషికి ఉద్యోగం లేకపోతే ఆరు నెలల్లోనే ఎన్నికలు పెట్టి మరీ కొలువు ఇప్పించుకున్నారు'అని ధ్వజమెత్తారు.

**దళితులకు సముచిత స్థానం ఇచ్చాం**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపే 59 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని సీఎం తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంతటి చరిత్రాత్మక నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. 65 రోజుల్లోనే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసినట్లు వెల్లడించారు. గ్రూప్-1 పరీక్షల ఫలితాలు ఇచ్చిన తర్వాత కొందరు ఉద్దేశపూర్వకంగా నియామకాలను ఆపారని విమర్శించారు. గ్రూప్-1 ఉద్యోగాలకు అర్హత సాధించిన వారిలో 89 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందినవారే ఉన్నారని తెలిపారు.

'వందేళ్ల చరిత్ర ఉన్న ఉస్మానియా యూనివర్సిటీకి గతంలో ఒక్క దళితుడు కూడా వైస్ చాన్స్‌లర్ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓయూకు వీసీగా దళిత మేధావిని నియమించింది. అంబేద్కర్ వర్సిటీ వీసీగా, ఉన్నత విద్యా మండలి కార్యదర్శిగా, విద్యా కమిషన్ చైర్మన్‌గా, రాష్ట్ర ఎన్నికల సంఘం చైర్మన్‌గా, అసెంబ్లీ స్పీకర్‌గా దళిత బిడ్డలకు అవకాశాలు వచ్చాయి. హెచ్‌సీయూలో చదివిని మేధావి భట్టి విక్రమార్క ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక మంత్రిగా పనిచేస్తూ ఆర్థిక వ్యవస్థను క్రమపద్ధతిలో నడుపుతున్నారు'అని పేర్కొన్నారు.

**వాళ్లు ఎగ్గోడితే.. మేము ఖర్చు చేస్తున్నాం: భట్టి**

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకువచ్చిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గుర్తుచేశారు. కానీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు నిధులు కేటాయించినప్పటికీ ఖర్చు చేయకుండా ఎగ్గొట్టిందని విమర్శించారు. అలా ఎగ్గొట్టిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం లెక్కించి క్యారీ ఫార్వర్డ్ చేసి ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ఎస్సీలకు రూ.13,223 కోట్లు, ఎస్టీలకు 1,296 కోట్లు క్యారీ ఫార్వర్డ్ చేసినట్లు వివరించారు.

5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు స్వయం ఉపాధి కోసం ఏడాది కాలంలోనే రూ.8 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 102 సమీకృత గురుకులాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు మల్లు రవి, కడియం కావ్య, గడ్డం వంశీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

# మేడిగడ్డ బరాజ్‌పై ఎన్‌డీఎస్ఏ నివేదిక బూటకం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఊహాజనితమైన నివేదికను క్రూర రాజకీయ ఎజెండాతో కాంగ్రెస్, బీజేపీ కేంద్ర కార్యాలయాల్లో తయారు చేశారని మండిపడ్డారు. పనికిరాని ఆ నివేదిక తమకు ప్రామాణికమని సీఎం రేవంత్ చెప్పడం ప్రభుత్వ అసమర్థ, దివాలాకోరు విధానాలకు నిదర్శనమని పేర్కొన్నారు.

రేవంత్ నిర్వాకం వల్ల ఏడాదిన్నరగా రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల్లో పంట ఎండి, 500మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండా ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన నివేదికను ఎల్‌అండ్‌టీ పూర్తిగా తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు.



**ఏ మూలకు వెళ్లినా కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత**

తెలంగాణలో ఏ మూలకు వెళ్లినా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందని కేటీఆర్ అన్నారు. లండన్ పర్యటనలో ఉన్న ఆయన బీఆర్ఎస్‌కు చెందిన ఎన్ఆర్ఐ నేతలతో సమావేశమయ్యారు. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) లోనూ పార్టీ రజతోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. అలాగే అమెరికాలోని డాలస్ నగరంలో జూన్ 1వ తేదీన సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇదే క్రమంలో త్వరలో యూకేలోను సంబరాలు నిర్వహిస్తామని, ఈ సంబరాలకు స్వయంగా తాను హాజరు కావడంతో పాటు పార్టీ సీనియర్ నేతలు, తెలంగాణ కళాకారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు వస్తారని కేటీఆర్ తెలిపారు.

తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న దోపిడీ, అరాచకాలు, ప్రజలపై వేధింపులను బాగా ఎండగడుతున్నారని యూకే ఎన్ఆర్ఐ నేతలను కేటీఆర్ ప్రశంసించారు. ఇంగ్లండ్‌లో ఉన్న సోషల్ మీడియా వారియర్స్‌పై కూడా అక్రమ కేసులు పెట్టినా ఎక్కడా తగ్గకుండా రేవంత్ ప్రభుత్వ దాష్టీకాలను ప్రశ్నిస్తున్నారన్నారు. అలాగే తెలంగాణ ప్రగతికి బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేయాలని వారికి విజ్ఞప్తి చేశారు.

**అనిల్ కూర్మాచలంకు పరామర్శ**

గుండెకు సంబంధించిన అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకుని లండన్‌లో కోలుకుంటున్న బీఆర్ఎస్ నాయకుడు, ఫిలిమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలంను కేటీఆర్ పరామర్శించారు.

# నైరుతి రుతుపవనాల దూకుడు

(మొదటి పేజీ తరువాయి)

కానీ ఈసారి కేవలం రెండున్నర రోజుల వ్యవధిలోనే విస్తరించడం గమనార్హం. ప్రస్తుతం రుతుపవనాల కదలికలు చురుకుగా ఉండటంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రానున్న మూడు రోజులు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు... కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ సూచించింది.

ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించిన వాతావరణ శాఖ... ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

**జూన్ నెలలో విస్తారంగా వర్షా లు...**

కాగా, జూన్ నెలలో రుతుపవనాల గమనానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయి. దీంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనాలు విడుదల చేసింది. నైరుతి సీజన్‌లో జూన్ నెలలో రాష్ట్రంలో కురవాల్సిన సాధారణ వర్షపాతం 12.94 సెంటీమీటర్లు. ఐఎండీ అంచనాల ప్రకారం జూన్ నెలలో సాధారణం కంటే అధికంగా వర్షాలు కురుస్తాయని.. సగటున 111 శాతం వర్షపాతం నమోదు కావొచ్చని వివరించింది.



గతేడాది జూన్ నెలలో 15.9 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణంకంటే 23 శాతం అధికంగా వర్షపాతం నమోదు కాగా... ఈసారి అంతకుమించి వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బుధవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. అత్యధికంగా నారాయణపేట జిల్లా ఉట్కూర్‌లో 4.88 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అదేవిధంగా వికారాబాద్ జిల్లా బషీరాబాద్‌లో 3.0 సెంటీమీటర్లు, సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 2.75 సెంటీమీటర్లు, నల్లగొండ జిల్లా గుండ్లపల్లెలో 2.28 సెంటీమీటర్లు, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో 2 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

# జూన్ 5న కమిషన్ ఎదుట హాజరు కాబోతున్న కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

జూన్ 5న కేసీఆర్, 9న హరీశ్‌రావు కమిషన్ ముందు హాజరు కానున్న నేపథ్యంలో అక్కడ వినిపించాల్సిన వాదనలు, ఇవ్వాల్సిన వివరణపై వారు చర్చించినట్లు సమాచారం. కమిషన్ ఏర్పాటు నుంచి ఇప్పటివరకు జరిగిన విచారణ తీరుతెన్నులను కేసీఆర్ సమీక్షించినట్లు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు అందులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌కు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు క్రోడీకరించి నివేదిక సిద్ధం చేయాలని సూచించినట్లు సమాచారం. కాగా ఇందుకు సంబంధించి కొందరు సాగునీటి రంగ నిపుణులు, సాంకేతిక నిపుణుల నుంచి కూడా వివరాలు కోరినట్లు తెలిసింది.

**ఎన్‌డీఎస్ఏ నివేదికలో లోపాలపైనా చర్చ**

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ఇచ్చిన నివేదిక అశాస్త్రీయంగా ఉందని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ చేసిన ప్రకటనపైనా ఈ భేటీలో లోతుగా చర్చించినట్లు తెలిసింది. ఎన్‌డీఎస్ఏ నివేదికలోని డొల్లతనాన్ని కమిషన్ ఎదుట ప్రస్తావించాలని నిర్ణయించినట్లు సమాచారం.

కమిషన్‌కు అరకొర సమాచారం ఇవ్వకుండా పూర్తి స్థాయి ఆధారాలతో వివరణ ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు సంబంధించి గోదావరి నదుల విషయంలో పాలకులు చూపిన నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపాలని భావిస్తున్నట్లు తెలిసింది.

కాగా తాము అన్ని విషయాలు వివరించేందుకు వీలుగా తగినంత సమయం ఇవ్వాలని కూడా కమిషన్‌ను కోరాలని బీఆర్ఎస్ భావిస్తోంది. రాజకీయ దురుద్దేశంతో విచారణ కమిషన్ ఏర్పాటు చేశారని మొదట్నుంచీ పేర్కొంటున్న నేపథ్యంలో.. తమ వాదన వినిపించేందుకు తగినంత సమయం ఇవ్వకపోతే అనుసరించాల్సిన వైఖరిపైనా సమావేశంలో చర్చించినట్లు తెలిసింది.



**నేడో రేపో పీపీ ప్రజెంటేషన్!**

విచారణ కమిషన్ ఎదుట హాజరవడానికి ముందే మీడియాకు కాళేశ్వరం ప్రాజెక్టు పూర్వాపరాలు, స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని హరీశ్‌రావును కేసీఆర్ ఆదేశించినట్లు తెలిసింది. ఈ మేరకు అవసరమైన సమాచారాన్ని క్రోడీకరించే పనిలో హరీశ్ ఉన్నట్లు సమాచారం. కాగా ఒకటీ రెండు రోజుల్లోనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు సంబంధించిన తేదీని బీఆర్ఎస్ ప్రకటించే అవకాశముంది.

# హైకోర్టు సీజేగా జస్టిస్ ఏకే సింగ్!

(మొదటి పేజీ తరువాయి)

2012, జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2014, జనవరి 16న శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2022, డిసెంబర్ నుంచి 2023, ఫిబ్రవరి వరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వర్తించారు. 2023, ఏప్రిల్ 17న ప్రధాన న్యాయమూర్తి పదోన్నతితో త్రిపుర హైకోర్టుకు బదిలీ అయ్యారు. తెలంగాణ హైకోర్టు సీజేగా విధులు నిర్వహించిన జస్టిస్ అలోక్ అరాధే జనవరిలో బాంబే హైకోర్టుకు బదిలీ అయినప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది.



తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న జస్టిస్ సుజోయ్‌పాల్‌ను కూడా కలకత్తాకు బదిలీ చేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. కాగా, రాజస్తాన్ సీజేగా ఉన్న జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవను మద్రాస్ హైకోర్టుకు, జార్ఖండ్ సీజేగా ఉన్న జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావును త్రిపుర హైకోర్టుకు, మద్రాస్ హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ కేఆర్ శ్రీరామ్‌ను రాజస్తాన్ హైకోర్టుకు బదిలీ చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
గురువారం-29- మే 2025







# కూతురు పుట్టిన ఇల్లు కళకళలాడుతూ ఉంటుంది....

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

సామాజికంగా తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు వస్తేనే అడపిల్లలకు సమానత్వం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఆడపిల్లలు పుట్టడం అదృష్టమని తెలుపుతూ, ప్రతి బుధవారం జిల్లా వ్యాప్తం గా నిర్వహిస్తున్న మా పాప మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరం 51వ డివిజన్ ద్వారకనగర్ లో బేగం కుటుంబ సభ్యులు, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు అందంగా ఇంటిని అలంకరించి ఆడపిల్లలను పుట్టనిద్దాం.. ఆడపిల్లలను పెర గనిద్దాం.. అమ్మాయిలు ఐపీఎస్, ఐఎఎస్, పోలీస్, డాక్టర్, టీచర్, లాయర్, సైంటిస్ట్, పైలెట్ పలు రంగాల్లో ఉన్నతంగా రాణించా లనే నినాదాలతో ముగ్గులు వేసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు ఘన స్వాగతం పలికారు. షాజీదాబేగం అఖీల్ దంపతులకు 12 ఫిబ్రవరి, 2025న ఆడపిల్ల పుట్టిన విషయం తెలిసి, వారి ఇంటికి వచ్చిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాప తల్లిదండ్రులతో పాటు నాన్నమ్మ, పెద్దనాన్న, పెద్దమ్మ బంధువులను కలిసి స్వీట్ బాక్స్, ఫ్రూట్స్, నూతన దుస్తులు, సర్టిఫికెట్ అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సన్మానించారు. చేతులతో పాపను ఎత్తుకొని రంగు రంగుల పూలతో ముస్తాబు చేసిన ఊయలలో వేసి పాప చిరునవ్వుకు కలెక్టర్ మురిసిపోయారు. సమాజానికి ఆడపిల్లల ఆవశ్యకత ఏలాంటిదో వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఆధికారులు ఈ కార్యక్రమంలో ఆడబిడ్డలను ఆశీర్వదించడం చూస్తుంటే సంతృప్తి కలుగుతుందని ఆనందం వెలిబుచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ సమాజంలో మహిళలు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ముందుంటున్నారని, ఆడపిల్లలను బాధ్యతగా పెంచి పోషించి బంగారు భవిష్యత్‌ను కల్పించాలని కోరారు. ఆడబిడ్డ పుట్టిన తల్లిదండ్రులు అదృష్టవంతులు అని అన్నారు. అమ్మాయిలను మగవారితో పమానంగా విద్య, వైద్యం, న్యాయం, సంరక్షణ, సామాజిక ఎదుగుదలకు అవకాశాలు కల్పించాలని సూచించారు. ఆడపిల్లలే ఇంటికి మణి దీపాలు ప్రస్తుత ఆధునిక యుగంలో అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పోటీపడుతూ దూసుకెళ్తున్న మహిళలు ఏ రంగంలో తక్కువ కాదు అని నిరూపిస్తున్నారని అన్నారు. కుటుంబ వ్యవస్థలో, సమాజం అత్యాధునిక అభివద్ది పదంలో కొనసాగటానికి ప్రధాన భూమిక మహిళలదే అని, మహిళలను బాల్యం నుండే ప్రోత్సహించి దేశ అభ్యున్నతికి అందరూ కషి చేయాలని తెలియజేశారు.

అమ్మాయిలు గొప్ప స్థానంలో ఎదిగేందుకు ఎవరికి తక్కువ కాకుండా పెంచాలని, మనం ఆశించే మార్పు మన ఇంటి నుండే ప్రారంభించాలని, ఆడబిడ్డ కుటుంబానికి అమ్మగా ఉంటుందని, అన్ని బంధాలకు మాతృప్రేమ పంచేవారని అన్నారు. సమాజంలో అమ్మాయి పుడితే మనకు అమ్మ పుట్టినట్లు భావించాలని కలెక్టర్ సూచించారు.

మహిళా శిశు సంక్షేమం కోసం ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో ఏ ఇంట్లో ఆడపిల్ల పుట్టినా జిల్లా అధికారులు వెళ్లి తల్లిదండ్రులకు స్వీట్ బాక్స్ ఇచ్చి, మంచి సందేశం అందించాలని, మహాలక్ష్మి ఇంట్లో పుట్టినందుకు శుభాకాంక్షలు తెలిపాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు.

ఆనతరం పాప తల్లిదండ్రులు మాట్లాడుతూ, మా ఇంటికి కలెక్టర్ వచ్చి మా పాపకు ఆశీస్సులు అందించి, పాప భవిష్యత్తు గురించి చెప్పడం ఎంతో సంతోషంగా ఉందని, కలెక్టర్ చెప్పిన విధంగా మా పాపను మంచిగా చదివించి ఉన్నత స్థాయిలో ఉండే విధంగా తీర్చిదిదుతామని, పాప పెద్దయిన తర్వాత ఇంటికి కలెక్టర్ గారే స్వయంగా వచ్చి దీవించి వెళ్లారని తెలిపి ఈ నాటి మధుర క్షణాలను పంచుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిడిపివో బి. వీరభద్రమ్మ, సూపర్వైజర్ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి టీచర్లు, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మేళ్లచెరువు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం చైర్మన్ మేళ్లచెరువు వెంకటేశ్వరరావు తన మానవత్వాన్ని మరోసారి ప్రదర్శించారు. కల్లూరు పట్టణం మధిర రోడ్డుకు చెందిన 62 ఏళ్ల కంచర్ల పుల్లారావు ఇటీవల కిడ్నీ వ్యాధితో బాధపడుతూ, వెరికోస్ వేయిన్స్ శస్త్రచికిత్స చేయించుకొని తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ సందర్భంగా బుధవారం పుల్లారావు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలోని తన చాంబర్లో చైర్మన్ మేళ్లచెరువు వెంకటేశ్వరరావును కలిసి తన పరిస్థితిని వివరించుకున్నాడు. వెంటనే ఆర్థికసాయం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నాడు మేళ్ళచెరువు వెంకటేశ్వరరావు. ఈ ఘటనపై పలువురు మేళ్లచెరువు వెంకటేశ్వరరావుకు అభినందనలు తెలియజేశారు. సమాజంలో మానవత్వానికి జీవం పోసే ఈ విధమైన చర్యలు అందరికీ ఆదర్శంగా నిలవాలని అభిప్రాయపడ్డారు.





# సత్తుపల్లి లో ఘనంగా స్వర్గీయ ఎన్ టి ఆర్ జయంతి వేడుకలు!

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

సత్తుపల్లి పట్టణం: మాజీ ముఖ్య మంత్రి, తెలుగుదేశం పార్టీ స్థాపకులు, తెలుగు జాతి ఆత్మ గౌరవం చాటిన మహానుభావులు, నట సార్వభౌముడు స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించిన సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాఘమయి దయానంద్. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సత్తుపల్లి నియోజకవర్గం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలుగు వారి కీర్తిని ప్రపంచ దేశాలకి చాటి చెప్పిన నేత ఎన్టీఆర్!

- **తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పొట్రు రామారావు.**

**సత్తుపల్లి పట్టణం:**

సినీ, రాజకీయ రంగాలలో తెలుగువారి కీర్తిని ప్రపంచ దేశాలకి సాటి చెప్పిన మహానేత నందమూరి తారక రామారావు అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పొట్రు రామారావు అన్నారు, బుధవారం నందమూరి తారక రామారావు 102. జయంతి వేడుకలను పురస్కరించుకొని సత్తుపల్లి పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని ఢిల్లీకి చాటి చెప్పిన నేత, తెలుగుదేశం పార్టీ స్థాపకులు సినీ రాజకీయ రంగాలలో తనదైన శైలి లో నూతన వరవడి సృష్టించి పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కృషిచేసిన ఎన్టీఆర్ సేవలు నిరంతరం ప్రజలు స్మరిస్తుంటారని ఆయన కీర్తి ప్రతిష్టలు తెలుగు వారు ఉన్నంతకాలం నిలిచే ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకురాలు పొట్రు సరస్వతి, సత్తుపల్లి పట్టణ మండల టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలు ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలి

- **బోనకల్లు ఎస్సై వెంకన్న**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలని నకిలీలు అంటగడితే కేసులు నమోదు చేస్తామని బోనకల్లు ఎస్సై వెంకన్న అన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వైరా ఏసీపీ రహెమాన్ పర్యవేక్షణలో వ్యవసయశాఖ (ఏ ఓ) వినయ్,(ఏ ఈ ఓ) హరికృష్ణ తో కలసి మండలంలోని విత్తనాలు & ఎరువుల దుకాణాలలో, గోడౌన్లలో సంయుక్తంగా అకస్మిక తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో ఉన్న విత్తనాల స్టాక్ వివరాలను, ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. అదేవిధంగా విత్తనాలకు సంబంధించిన బిల్లు పుస్తకాలు, డెలివరి చలాన్‌లను, మార్కెటింగ్ అగ్రిమెంట్, వచ్చిన స్టాక్, విత్తనాల విక్రయ రిజిస్టర్, లాట్ రిజిస్టర్, రైతు విక్రయ రిజిస్టర్, లైసెన్స్ సక్రమంగా వున్నాయ లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా పకడ్బంది చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసి రకం, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు.రైతులు సైతం విత్తనాలు కొనుగోలు సమయంలో అప్రమత్తత పాటిస్తూ ..కొనుగోలు రశీదు తీసుకోవాలని సూచించారు. డీలర్లు, ఫెర్టిలైజర్ షాపు యజమానులు రైతులకు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, నిషేధిత పురుగు మందులు విక్రయిచవద్దని, రైతులకు నష్టం కలిగేలా వ్యవహారింవద్దని అన్నారు. మార్కెట్ లో నకిలీ విత్తనాల విక్రయం జరుగకుండా టాస్క్ ఫోర్స్ బృందాల నిరంతరం పర్యవేక్షణ వుంటుందని తెలిపారు. కొంతమంది దళారులు ముఠాలుగా ఏర్పడి, తక్కువ డబ్బుకు విత్తనాలు ఇస్తామని ఆశ చూపి రైతులను మోసం చేస్తారని, ఇటువంటి వారిపై గ్రామాల్లో సైతం నిఘా పెట్టామని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే మండల వ్యవసాయ శాఖ అధికారికి గాని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- **పెద్దమందడి మండల వ్యవసాయ అధికారి సైదులు యాదవ్**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దమందడి మండల వ్యవసాయ అధికారి సైదులు యాదవ్ హెచ్చరించారు. బుధవారం వ్యవసాయ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెద్దమందడి మండలంలోని మణిగిల్ల గ్రామం , పెద్దమందడి మండల కేంద్రంలోని సీడ్స్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. వ్యాపారస్తులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను మాత్రమే అమ్మాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు, పురుగుల మందులు అమ్మితే వ్యాపారస్తులపై కఠిన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసు నమోదు చేస్తామని అన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు, ఎరువులకు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి వ్యవసాయ అధికారి సైదులు యాదవ్, పెద్దమందడి ఎస్సై శివకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మంద కృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలుకుదాం..

- **ఎమ్మార్పీఎస్ శ్రేణులకు పిలుపు**
- **జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ**

**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాలు పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో అత్యవసర సమావేశం నిర్వహించారు.జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాట్లాడుతూ..భారత అత్యున్నత పౌర పురస్కారమైన పద్మశ్రీ పురస్కారాన్ని భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకొని ఈనెల 31న వరంగల్ నగరానికి ఢిల్లీ నుండి విచ్చేయుచున్న పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ కు ఘన స్వాగతం పలకడానికి జిల్లాలోని ప్రతి గ్రామం నుండి ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల శ్రేణులు జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈనెల 31న ఉదయం 10గంటలకు వరంగల్ రైల్వే స్టేషన్ కు తరలిరావాలని మరియు అదే రోజు హనుమకొండ లోని కాళోజి కళాక్షేత్రంలో ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సదస్సు జరుగుతుందని తెలిపారు.అనుబంధ సంఘాల నాయకులు, కవులు,కళాకారులు,విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో గట్టు స్వామి మాదిగ మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎం ఎస్ పి) వనపర్తి జిల్లా కన్వీనర్ ఆర్. రమేష్ మాదిగ, ఎం ఎస్ ఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా ఇన్చార్జ్ కొమ్ము చెన్నయ్య మాదిగ,ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రంజిత్ మాదిగ,చిన్నంబావి మాజీ సర్పంచ్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బుచన్న మాదిగ,రాములు మాదిగ,పులేందర్ మాదిగ,యాదగిరి మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్

- **శ్రీనివాస్ రెడ్డి టిడిపి మండల అధ్యక్షుడు**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

తెలుగు జాతి ఆత్మ గౌరవ ప్రతీకగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు నిలిచారని పెద్దమందడి మండల టిడిపి అధ్యక్షుడు వెల్టూర్ పెద్ద శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా.. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ప్రపంచంలో తెలుగు జాతికి గుర్తింపు తెచ్చిన నాయకుడు ఎన్టీఆర్ అని గుర్తుచేశారు.ఎన్టీఆర్ తన నటనతో,రాజకీయ నాయకుడిగా ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసి అన్ని రంగాల్లో తనదైన ముద్ర వేశారని ఎన్టీఆర్ సేవలను కొనియాడారు.బడుగు బలహీన వర్గాల ప్రజలకు రాజ్యాధికారం కృషి చేసిన మహనీయుడని అని అన్నారు.తెలుగుదేశం పార్టీని స్థాపించి 6 నెలలకే పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన ఘనత ఎన్టీఆర్ కి దక్కిందని తెలిపారు.తెలుగు వారి గుండెల్లో ఎన్టీఆర్ స్థానం పదిలమని,తెలుగువారి స్థాయిని పెంచారని అన్నారు .ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, ముష్టి శ్రీనివాసులు, అశోక్ (చిట్టి),శ్రీనివాసులు, కావలి వెంకటయ్య,ఆంజనేయులు,మెరుగు శీను, రంజిత్ గౌడ్,సతీష్ గౌడ్, శ్రీను, షేరి యాదయ్య,కృష్ణయ్య, నాగన్న, వెంకట్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత బస్సు వల్ల ఉపాధి కోల్పోయి 120 కి పైగా ఆటో డ్రైవర్ల ఆత్మహత్య

- **ఆర్థిక ఇబ్బందులతో రాష్ట్రంలో మరో ఆటో డ్రైవర్ ఆత్మహత్య**

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలోని ఆర్& ఆర్ కాలనీకి చెందిన పాసి దుర్గాప్రసాద్ (45) అనే ఆటో డ్రైవర్, జగదాంబ సెంటర్లో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు ఇటీవల తన కూతురు వివాహం కోసం అప్పు చేయగా, ఉచిత బస్సు వల్ల సంపాదన లేక అప్పు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ దుర్గాప్రసాద్ కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు పేరిట ఆటో డ్రైవర్ల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని, ఆటో డ్రైవర్ల పట్ల కనీస కనికరం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆటో సంఘాల నాయకులు

# ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ త్వరగా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



వనపర్తి జిల్లాలో మొదటి విడతలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ త్వరగా అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం పెబ్బేరు తహసిల్దార్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తత, పెబ్బేరు వనపర్తి రోడ్డు విస్తరణ పై సమీక్ష నిర్వహించారు.ఇందిరమ్మ ఇళ్లు మొదటి విడతలో మంజూరు అయిన వాటిని త్వరగా గ్రౌండింగ్ అయ్యే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని మండల అభివృద్ధి అధికారిని ఆదేశించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత జాబితా పారదర్శకంగా ఉండేవిధంగా చూసుకోవాలని సూచించారు.పెబ్బేరు వనపర్తి రోడ్డు విస్తరణ పై చర్చిస్తూ రోడ్డు విస్తరణలో తొలగించాల్సిన ఇంటి నిర్మాణ యజమానులకు నోటీస్ లు జారీ చేసే నిర్మాణాలు తొలగించాలని, రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.వర్షాకాలం ప్రారంభం అయినందున దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుంది కాబట్టి ఫ్రై డే డ్రై డే, పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అవగాహన కొరకు గోడ పత్రికలు,కరదీపికలు ముద్రించి పంచాలని సూచించారు,తహసిల్దార్ ఎస్ .మురళి, మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి,ఎంపీడీఓ రవీందర్,ఎంపీఓ రోజా తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరస్తుడును అరెస్టు చేసిన ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



ఆన్లైన్ లో ట్రేడింగ్ మరియు ఇన్వెస్ట్మెంట్ లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి, సుమారు 1.62 కోట్ల రూపాయలు మోసం చేసిన కేసులో మరోకరిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు సిద్దిపేట లో అరెస్టు చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునిల్ దత్ తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం జిల్లాలోని బోనకల్ మండలానికి చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ కి ఫోన్ చేసి ఆన్లైన్ లో ట్రేడింగ్ మరియు ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి వాట్సప్ మరియు ట్రేడింగ్ లింకుల ద్వారా సుమారు 1.62 కోట్ల రూపాయలు ఇన్వెస్ట్మెంట్ చేసి మోసపోయిన కేసులో గాను తేదీ 26.05.2025 ముగ్గురు నిందుతుల ను అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించిన నేపద్యంలో 27.05.2025 మరొక్క నిందుతుడు అయిన నలువాల అర్జున్, 33 సం. ని గుర్తించి సిద్దిపేట జిల్లాలో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. ఈ కేసుల విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైం డి.ఎస్పీ సిహెచ్ ఆర్ వి ఫణిందర్ ని, ఎస్సైలు రంజిత్ కుమార్, విజయ్ కుమార్ మరియు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఖమ్మం సి.పి అభినందించారు.



# ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు


- ఐఐటి ప్రిపరేషన్ కోసం అండగా ఉంటా
- ఇంటర్ లో ప్రతిభ చాటిన విద్యార్థినికి ఘన సన్మానం
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**


వనపర్తి కె.డి.ఆర్(32వార్డ్)కు చెందిన వరప్రసాద్ గుప్తా కుమార్తె హసితశ్రీ ఇటీవల జరిగిన ఇంటర్మీడియట్ ఎం.పి.సి గ్రూప్ నందు 470 మార్కులకుగాను 466సాధించారు.ఇట్టి విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి విద్యార్థిని హసితశ్రీ ని ఘనంగా సన్మానించారు.ఈ సందర్బంగా.. మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ..చిరు వ్యాపారి(టీ కొట్టు)కూతురు పట్టుదలతో చదివి అగ్రర్యాంక్ సాధించడం అభినందనీయం అని ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు.హసితశ్రీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఐ. ఐ.టి ప్రిపరేషన్ కోసం తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమములో గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్, పెండెం.కురుమూర్తి యాదవ్,మాణిక్యం ,నాగన్న యాదవ్, జోహెబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# నేరడ ఘనంగా ఎన్టీఆర్ జయంతి

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



బుధవారం చింతకాని మండలం నేరడ గ్రామంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పఠాన్ సొంద్ సమక్షంలో తెలుగుదేశం పార్టీ జెండాను నందమూరి తారక రామారావు విగ్రహం దగ్గర మాజీ ఎంపీటీసీ సొందు సాహెబ్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలస్యం రాములు, కొల్లి బాబు, ఆలస్యం గోవిందరావు, వడ్డేపూడి ముత్తయ్య, చెవుల పుల్లయ్య, కోట బుచ్చలు, వెంకటి, పానకాలు, ఉపేందర్, హుస్సేన్ మియా, సొందు, లాలు, ఉప్పల, పాషా, నరసింహారావు, నాసర బాబు, అల్లిక శీను, పి గోవిందరావు, డాక్టర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.






# లాభసాటి వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్‌కు పటిష్ట కార్యాచరణ అమలు.....

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

రాజీవ్ యువ వికాసం పథకం క్రింద లాభసాటి వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్ జరిగేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.బుధవారం రాజీవ్ యువ వికాసం అమలు పై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు హైదరాబాద్ లోని సచివాలయం నుంచి అన్ని జిల్లా కలెక్టర్ లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక, లాభదాయకమైన స్వయం ఉపాధి యూనిట్ ఎంపిక, నైపుణ్య శిక్షణ అందించడం, యూనిట్ గ్రౌండింగ్ తర్వాత పర్యవేక్షణ వంటి పలు అంశాల గురించి డిప్యూటీ సీఎం చర్చించి పలు సూచనలు జారీ చేశారు.

యువ వికాసం పథకం క్రింద వచ్చే సహాయంతో యువత వ్యాపారం చేసి లబ్ధి పొందాలని, యువతను వ్యాపార వేత్తలుగా మార్చేలా ప్రభుత్వం పెట్టే ప్రతి పైసా పెట్టుబడి ఎలా పనిచేస్తుందో రెగ్యులర్ గా మానిటరింగ్ చేయాలని డిప్యూటీ సీఎం తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూజూన్ 2న ఎంపిక చేసిన లబ్ధిదారులకు రాజీవ్ యువ వికాసం ఉపాధి యూనిట్ మంజూరి పత్రాలను అందజేయాలని అన్నారు.

జూన్ 2 నాడు మంజూరు చేసే లబ్ధిదారుల లో అన్ని వర్గాలకు చెందిన వారు ఉండేలా చూడాలని, జూన్ నుంచి ప్రతి నెలా యువ వికాసం యూనిట్ గ్రౌండింగ్ కు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారీగా లబ్ధిదారులకు శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయడానికి కార్యాచరణ రూపొందించాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ఎస్సి కార్పొరేషన్ ఇడి నవీన్ బాబు, మైనార్టీ సంక్షేమ అధికారి పురందర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# మహిళా సంఘాల ఉత్పత్తులకు ప్రణాళిక బద్ధంగా డిమాండ్ సృష్టించాలి..

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మం మహిళా మార్ట్ ను ప్రారంభించిన మంత్రి తుమ్మల

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు ప్రణాళిక బద్ధంగా డిమాండ్ సృష్టించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

బుధవారం మంత్రి, ఖమ్మం నగరంలో 30 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన ఖమ్మం మహిళా మార్ట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మహిళా సంఘాలు తయారు చేసిన పరికరాలు, వస్తువుల విక్రయం కూడా వారి ద్వారానే జరగాలని పట్టుదలతో జిల్లా కలెక్టర్, మహిళా మార్ట్ ను ఏర్పాటు చేశారని తెలిపారు. దళారులకు లాభం వెళ్లకుండా మహిళా సంఘాలు లాభపడాలనే ఆకాంక్షతో ప్రభుత్వం మహిళా మార్ట్ ఏర్పాటు చేసిందని అన్నారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి మహిళా సంఘాలు తయారు చేసే వస్తువులను విక్రయించేందుకు హైదరాబాదులోని శిల్ప కళారామం వేదికలో అవకాశం కల్పించారని తెలిపారు. అదే విధంగా ఖమ్మం నగరంలో ప్రయోగాత్మకంగా ఖమ్మం మార్ట్ ఏర్పాటు చేసామని తెలిపారు.

ఖమ్మం నగరంలో నాలుగు వైపులా ఉన్న నాలుగు మార్కెట్లలో కూడా మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా మార్ట్ లాంటి సౌకర్యాలను కల్పించాలని అన్నారు. ముదిగొండ మహిళలు బ్యాగులు తయారు చేశారని, బ్రాండెడ్ షాపుల కంటే చాలా బాగా ఉన్నాయని అన్నారు.

మనం తయారు చేసిన వస్తువుకు వ్యాపారం జరగాలంటే అన్ని చోట్ల ప్రదర్శనలు చేయాలని మంత్రి సూచించారు. బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ వంటి జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా చిన్న, చిన్న స్టాల్స్ వంటివి ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులు మన ప్రజలు వాడుకునేలా తయారు కావాలని అన్నారు. మన వస్తువులు పక్క దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని మంత్రి తెలిపారు.

మన పిల్లలు బాగా చదువుకుంటేనే పేదరికం నుంచి బయటకు వస్తామని, పిల్లలను లింగ బేధం లేకుండా ఉన్నత చదువులు చదివించాలని మంత్రి సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మహిళలను ప్రత్యేకంగా ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, ఇందులో భాగంగా మన ఖమ్మం జిల్లాలో ప్రత్యేకంగా టీ స్టాల్, షీ రాక్స్ సెంటర్, మహిళలకు లాభం కలిగేలా అనేక కార్యక్రమాలను ప్రత్యేకంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

6 నెలల క్రితం మంత్రి ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాలో మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తుల కోసం ప్రత్యేకంగా మహిళా మార్ట్ ఏర్పాటు చేశామని అన్నారు. మహిళలకు ఉత్పత్తులు తయారు చేయడంతో పాటు వాటి ప్యాకింగ్, మార్కెటింగ్ ఎలా చేయాలి, దళారులు లేకుండా లాభం పూర్తి స్థాయిలో మహిళలకు అందాలని మార్ట్ ఏర్పాటు చేశామని అన్నారు. మహిళా సంఘాల్లోని మహిళలకు మార్ట్ నిర్వహణపై శిక్షణ కూడా అందించామని అన్నారు. ఖమ్మం నుంచి వచ్చే ఫలితాలను దృష్టిలో ఉంచుకుని మిగిలిన మున్సిపాలిటీ లలో కూడా ఇటువంటి మార్ట్ ఏర్పాటుకు భవిష్యత్తులో చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో మహిళా సంఘాలు ఉత్పత్తి చేసే 20 రకాల వస్తువులు మన జిల్లా బ్రాండింగ్ తో ఏర్పాటు చేశామని అన్నారు. మన జిల్లా వాసుల కోసం మన మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులు ఖమ్మం మహిళా మార్ట్ లో ఎటువంటి కల్తీ లేకుండా పూర్తి నాణ్యతతో కూడిన పదార్థాలు అందుబాటులో ఉంటాయని అన్నారు.

మహిళా మార్ట్ ఆవరణలో ఏర్పాటు చేసిన టీ స్టాల్ ను మంత్రి ప్రారంభించి, టీ త్రాగారు.

అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకాష్ నగర్ 29వ డివిజన్ లో టి.యూ.ఎఫ్.ఐ.డి.సి నిధులు 60 లక్షల రూపాయలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు నాణ్యతతో పదికాలాలపాటు ఉండేలా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పూనుకొల్లు నీరజ, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, మార్కెట్ కమిటీ చైర్మన్, డి.ఆర్.డి.ఓ. సన్యాసయ్య, ఆర్డీఓ నరసింహారావు, పంచాయతీ రాజ్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, కార్పొరేటర్లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక స్వర్గీయ ఎన్టీఆర్



- మాజీ ఎంపీ నామ

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

తెలుగు ప్రజల ఆరాధ్య నటుడు, దివంగత సీఎం, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, పద్మశ్రీ డా. నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని ఆయనను స్మరించుకుంటూ బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్టీఆర్ వ్యక్తిత్వం, ఆయన సినీ, రాజకీయ జీవితంలో సాధించిన ఘనతలు నేటికీ ఎందరికో ప్రేరణగా నిలుస్తున్నాయని నామ తెలిపారు. తెలుగు చలనచిత్రరంగానికి ఎన్టీఆర్ అందించిన విశిష్ట సేవలు, రాష్ట్ర ప్రజల కోసం ఆయన చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలు చిరస్మరణీయమని కొనియాడారు. రాజకీయ నాయకుడిగా ఎన్టీఆర్ ఎన్నో సవాళ్లు ఎదుర్కోవటంతో పాటు, ఎన్నో విప్లవాత్మకమైన సంస్కరణలు చేపట్టారన్నారు. తన నాయకత్వంలో ఎన్నో సామాజిక సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తుచేశారు. పటేల్ పట్వారీ విధానం రద్దు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం తదితర కార్యక్రమాలు పేదల అభిమానాన్ని చూరగొనడమే కాకుండా వారికి ఆర్థికంగా, సామాజికంగా ఎంతో భరోసానిచ్చాయన్నారు.

రూ.2 కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పేద వారికి గృహ నిర్మాణాలు సహ మధ్యాహ్న భోజన పథకాల ద్వారా సామాజిక న్యాయం అందించారని వివరించారు. ఎన్టీఆర్ సేవలను గుర్తించి ఆయనకు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ 17వ లోక్‌సభలో తాను ఈ విషయాన్ని ప్రస్తావించినట్టు నామ తెలిపారు. "ఎన్టీఆర్‌కు భారతరత్న లభిస్తే అది కేవలం ఒక వ్యక్తికి కాదు — ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ఇచ్చిన గుర్తింపు అవుతుంది" అని నామ అభిప్రాయపడ్డారు. ఎన్టీఆర్ పట్ల తన కున్న గౌరవం, అభిమానంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అనేక మండలాల్లో ఎన్టీఆర్ & నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. అలాగే ఎన్టీఆర్ భార్య బసవతారకం జ్ఞాపకార్థంగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ స్థాపించి పేదలకు అందుబాటులో ఉండే విధంగా అధునాతన క్యాన్సర్ వైద్యం అందించడం జరుగుతుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పదిహేనవ లోక్ సభ పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయడం కోసం చేసిన పోరాటం ఫలితంగా అది సాకారమైనదని నామ అన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక






# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు..

◆ అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

జిల్లాలో నిర్వహించు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై డిఆర్వో ఏ. పద్మశ్రీ తో కలిసి అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు వివరిస్తూ స్టాల్స్ ఏర్పాటుకు సిద్దం చేయాలని అన్నారు.

గ్రామీణ అభివృద్ధి శాఖ ఏర్పాటు చేసే స్టాల్ లో ఇందిరా డెయిరీ వివరాలను తెలియజేయాలని అన్నారు. సంక్షేమ శాఖ పరిధిలో ఏర్పాటు చేసే స్టాల్ లో ఇందిరా సౌర గిరి జల వికాసం, రాజీవ్ యువ వికాసం పథకాలను వివరించాలని అన్నారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు మినెట్ టు మినెట్ కార్యక్రమ ప్రణాళిక ప్రకారం సిద్ధం చేయాలని అన్నారు. జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సంబంధించి ఫ్లాగ్ ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్దం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకల డయాస్, సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, దీనిని అప్రమత్తంగా నిర్వహించాలని అన్నారు.

వేడుకల వద్ద వైద్య బృందాలచే వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, అవసరమైన మేర త్రాగు నీటి సరఫరా ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

వేడుకలకు ఆహ్వాన పత్రికలు ప్రోటోకాల్ ప్రకారం ప్రతి ఒక్కరికీ అందాలని అన్నారు. ముఖ్య అతిథి గౌరవ వందనం, ఇతర బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందిగా చేయాలని అన్నారు. అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని అన్నారు. రాష్ట్ర అవతరణ పోరాటాల సందేశం ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు జరగాలని అన్నారు. 25 నిమిషాలు పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేలా చూడాలని అన్నారు. అవతరణ వేడుకలకు పబ్లిక్ అడ్రస్ సిస్టం అర్బన్ తహసిల్దార్ ఏర్పాటు చేయాలని అన్నారు. పాత్రికేయులకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయాలని అన్నారు. వానాకాలం దృష్టిలో ఉంచుకొని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డ్రైయిన్ లను క్లియరెన్స్ కోసం ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే క్లియర్ చేయాలని, ప్రజలకు ఫిర్యాదుల నమోదు కోసం కంట్రోల్ రూమ్ నెంబర్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ షఫీ ఉల్లాను అదనపు కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా అధికారులు, పోలీసు, కలెక్టరేట్ ఏ.ఓ. అరుణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ సాహితీ సౌరభం సురవరం ప్రతాపరెడ్డి

◆ సురవరం ప్రతాపరెడ్డి ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ ప్రజల గొంతుకై నినదించిన తెలంగాణ సాహితీ సౌరభం సురవరం ప్రతాపరెడ్డి అని సురవరం ప్రతాపరెడ్డి ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సురవరం ప్రతాపరెడ్డి 130వ జయంతి వేడుకలను సురవరం ప్రతాపరెడ్డి వనపర్తి ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు.ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో గల సురవరం ప్రతాపరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు కమిటీ సభ్యులు మాట్లాడుతూ....గోల్కొండ పత్రిక సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి బహుబాషా కోవిదుడని, నిజాం నిరంకుశ పాలనపై అలుపెరుగని పోరాటం చేశాడని అన్నారు.పత్రికా సంపాదకుడిగా,స్వాతంత్ర సమర యోధుడిగా,కవిగా,రచయితగా తెలంగాణ ప్రజలను చైతన్యపరిచి తనదైన ముద్ర వేసుకున్నాడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సాక్షి దినపత్రిక జిల్లా ఇన్చార్జ్ బొలెమోని రమేష్, సూర్య పత్రిక జిల్లా స్టాఫ్ రిపోర్టర్ కొండన్న యాదవ్, విజయ క్రాంతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పికిలి రాము,స్వేచ్ఛ పత్రిక జిల్లా స్టాఫ్ రిపోర్టర్ యాదిరెడ్డి, తెలుగు ప్రభ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మహమ్మద్ ఖలీల్, జిల్లా రిపోర్టర్లు గంధం దినేష్,కుమార్, శేఖర్ యాదవ్, పురుషోత్తం, గోపాలకృష్ణ, పి అర్ న్యూస్ తరుణ్,ఫోటోగ్రాఫర్ అంజి తదితరులు పాల్గొన్నారు.

## తల్లాడ నూతన ఎస్సైగా ఎన్ వెంకటకృష్ణ బాధ్యతలు

**మధిర,**

తల్లాడ మండలం పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా సీపిఎస్ లో విధులు నిర్వహిస్తున్న ఎన్ వెంకటకృష్ణను నియమిస్తూ ఖమ్మం సీపీ సునీల్ దత్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న, బి కొండలరావును ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు.

## ఎస్సై, కానిస్టేబుల్‌ను సన్మానించిన కాంగ్రెస్ నేతలు

**వైరా,:**

తెలంగాణ పోలీస్ ఎస్సై, కానిస్టేబుల్ బదిలీలో భాగంగా తల్లాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నిధులు నిర్వహిస్తున్న ఎస్సై బి కొండలరావు, కానిస్టేబుల్ బాలాజీ ఖమ్మం బదిలీ అయిన సందర్భంగా తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాపా సుధాకర్, దగ్గుల రఘుపతి రెడ్డి, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన సీపీఎం నాయకులు

**పాలేరు:**

ఖమ్మం జిల్లా మధిర మండలం పరిధిలోని పలు గ్రామాలలో బుధవారం కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల మండల సిపిఎం నాయకులు శీలం నరసింహారావు ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలకు కనీసం 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు 600 రూపాయల వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఎం నాయకులు, స్థానిక ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వర్యులు స్వర్గీయ పద్మ శ్రీ డా"నందమూరి తారక రామారావు 102 వ జయంతి సందర్భంగా టిఎన్టియుసి ఆధ్వర్యంలో ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్ లో గల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం ఖమ్మం జిల్లా కార్యాలయంలోని ఎన్.టీ.ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి టిఎన్ టియుసి నాయకులు ఘనంగా నివాళులర్పించడం జరిగింది, ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి భాస్కరరావు, ఘుర్ రవీందర్, ఆటో శ్రీనివాస్, ఉయ్యూరు లక్ష్మయ్య చౌదరి, చావా రామారావు, లింగయ్య, పొదిల భూపతి, బుడిగే శ్రీను, నల్లమోతు సత్యనారాయణ, అబ్దుల్ మజీద్, ఓర్సు కృష్ణ, జైరాం, రామయ్యా తదితరులు పాల్గొన్నారు




## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించిన టిడిపి శ్రేణులు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

తెలుగుదేశంపార్టీ అడహాక్ కమిటీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాదం గారి ఆదేశానుసారం తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి వర్యులు నందమూరి తారకరామారావు గారి 102 వ జయంతి వేడుకలు ఖమ్మం జిల్లా కార్యాలయంలో హడ్ హక్ కమిటీ సభ్యులు కొండబాల కర్ణాకర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు, మొదటగా ఎన్టీఆర్ సర్కిల్ లో గల అన్న గారి విగ్రహానికి భారీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తదుపరి పార్టీ కార్యాలయానికి చేరుకుని కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కార్యాలయం ముందు జెండా ఆవిష్కరణ చేసారు. తదుపరి కేక్ కట్ చేసి కార్యకర్తలకు మిఠాయిలు పంచారు, పలువురు నాయకులు ఎన్టీఆర్ చేసిన పలు అభివృద్ధి పథకాలను తమ ఉపన్యాసంలో కొనియాడారు టీడీపీ జాతీయ అధ్యక్షులు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబుల నాయకత్వంలో తెలంగాణలో కూడ వచ్చే ఎన్నికలలో కూటమి అధికారంలోకి వస్తుందని నాయకులు ధీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లెంపాటి అప్పారావు, గుడిపూడి వెంకటేశ్వరరావు, మందడపు సుధాకర్, వనమా వాసు, నాగార్జున శ్రీనివాస్, బోయిన వెంకన్న, రాయల కోటేశ్వరరావు, మందపల్లి కోటేశ్వరరావు, పాలడుగు క్రిష్ణ ప్రసాద్, కొలికొండ మురళి, నల్లమాస మల్లయ్య, మల్లెంపాటి లహరిన్ , కర్ణాటి అశ్వనీ కుమార్, రాజ రాజేశ్వరి, కామ అనిత, చావా రామారావు, సామినేని లక్ష్మణ్ రావు, వాసిరెడ్డి భాస్కర్ రావు, చల్లంగుడ్ల రమేష్, మేకల సత్యవతి, తాడిశెట్టి స్వాతి, జాన్సీ, తిగుళ్ల రమణ, నల్లమోతు సత్యనారాయణ, అబ్దుల్ మజీద్, మంద వెంకటేశ్వర్లు, ఓర్సు కృష్ణ, జైరాం, లింగయ్య, పొదిల భూపతి, బుడిగే శ్రీను, తదితరులు పాల్గొన్నారు.




## మహనీయుడు బోజెడ్ల రవి....

–సీపీఎం నాయకులు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం అర్బన్ మండలంలోని రామన్నపేట,దానవాయిగూడెం ప్రాంతంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు అండగా ఉన్న మహనీయుడు బోజెడ్ల రవికుమార్ అని సీపీఎం పాలేరు డివిజన్ నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు అన్నారు.మండలంలోని రామన్నపేట కాలనీలో అమరజీవి బోజెడ్ల రవికుమార్ 27 వ వర్ధంతిని సీపీఎం రామన్నపేట శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా రవికుమార్ స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం సీపీఎం అర్బన్ మండల నాయకులు పడిగల నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో పలువురు సీపీఎం నాయకులు మాట్లాడారు. రామన్నపేట,దానవాయిగూడెం ప్రాంతాలలో బోజెడ్ల రవికుమార్ వారి తండ్రి వెంకట నారాయణ చేసిన సేవలను కొనియాడారు. సంపన్నుల కుటుంబంలో పుట్టిన అనుక్షణం అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు రవి కుమార్ అన్నారు. తన జీవితాంతం పేదల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన పోరాట యోధుడు రవికుమార్ అన్నారు.చిన్న వయసులో రవి మరణించడం సీపీఎం పార్టీకి,వారి కుటుంబానికి,దానవాయిగూడెం,రామన్నపేట ప్రాంతానికి తీరని నష్టం మిగిల్చిందన్నారు.రవి కుమారుడు అజయ్ 27 సంవత్సరాలుగా ఎన్ని అడ్డంకులు ఎదురైనా వారి తండ్రి వర్ధంతిని నిర్వహించడం అభినందనీయమన్నారు. రవి ఆశయాలు నెరవేర్చేందుకు అజయ్ పడుతున్న తపన వెలకట్టలేనిదన్నారు.రవి కుమారుడు అజయ్ మాట్లాడుతూ....తమ తండ్రి మరణించి 27 ఏళ్లయినా తమ కుటుంబాన్ని ఇన్ని సంవత్సరాలుగా కంటికి రెప్పలా కాపాడుతూ ఆదరిస్తున్న సీపీఎం పార్టీకి,రామన్నపేట గ్రామ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు.భవిష్యత్తులో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని మాట ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు తాటికొండ శ్రీను ,జక్కంపూడి కృష్ణ,పడిగల వీరయ్య,కూచిపూడి వెంకటేశ్వర్లు,వెంకట్రావు,గోపయ్య,షేక్ సర్వర్ మియా,కార్పొరేటర్ నిరంజన్,తిరపయ్య, భూక్య హరి సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## వాహనాలను సీజ్ చేస్తాం

**నిర్మల్ :**

సరైన ధ్రువపత్రాలు లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామని నిర్మల్ జిల్లా ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి అన్నారు. బుధవారం దస్తురాబాద్ మండలంలోని అకొండ పేట గ్రామంలో పోలీసులు కాంటాక్ట్ కమ్యూనిటీ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అపరిచితుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

## ఘనంగా రమాబాయి అంబేద్కర్ వర్ధంతి

**కోదాడ, ):**

కోదాడ పట్టణం లో రమాబాయి అంబేద్కర్ వర్ధంతి వేడుకలను మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత ప్రయాణంలో రమాబాయి అందించిన సహకారం సాటిలేనిది. రామబాయి పోరాటం, అంకితభావం వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంధం రంగయ్య, గంధం పాండు పంది తిరుపతయ్య, పాస్టర్ యేషయా, నందిగామ ,గోవిందు నాగరాజు ఉన్నారు.



## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

**జగిత్యాల,**

జగిత్యాల పట్టణంలోని 25, 26వ వార్డులో 40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగిత్యాల పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్పందన, మాజీ మున్సిపల్ చైర్మన్లు అడువాల జ్యోతి లక్ష్మణ్, గిరినాగభూషణం, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఆరుముల్ల పవన్, షకీల్, చిక్కుల భూమయ్య, డిఈ నాగేశ్వర్ పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మళ్లీ తగ్గిన బంగారం ధర..



పసిడి ధర గణనీయంగా పెరుగుతూ రికార్డ్ స్థాయికి చేరుకుంది. దాంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు బంగారం కొనాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ, గత కొన్ని రోజులుగా మళ్లీ బంగారం ధరలు నేల చూపులు చూస్తున్నాయి. మెల్లి మెల్లిగా పసిడి పరుగులు తగ్గించుకుంటూ కిందకు దిగి వస్తోంది. మన దేశంలో బంగారానికి ఎప్పుడూ డిమాండ్ ఎక్కువే.. ఇక పండుగలు, పెళ్లిళ్లు, ప్రత్యేక రోజులు ఇలా శుభకార్యం ఏదైనా సరే..చాలా మంది గోల్డ్ కొనుగోలు చేస్తుంటారు. అందుకే ప్రపంచంలోనే అత్యధికంగా బంగారం దిగుమతి చేసుకుంటున్న రెండో దేశంగా భారత్ రికార్డులు సృష్టిస్తోంది. అయితే, ఇటీవలి కాలంలో బంగారం ధరలు భగ్గుమంటున్నాయి.. పసిడి ధర గణనీయంగా పెరుగుతూ రికార్డ్ స్థాయికి చేరుకుంది. దాంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు బంగారం కొనాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ, గత కొన్ని రోజులుగా మళ్లీ బంగారం ధరలు నేల చూపులు చూస్తున్నాయి. మెల్లి మెల్లిగా పసిడి పరుగులు తగ్గించుకుంటూ కిందకు దిగి వస్తోంది. భారతదేశం బులియన్ మార్కెట్లో బంగారం ధరలు వరుసగా రెండో తగ్గాయి. ఈరోజు 24 క్యారెట్ల బంగారం ధర ఒక గ్రాము రూ. 9,747లు కాగా, అదే 22 క్యారెట్ల బంగారం ధర ఒక గ్రాము రూ .8,934లుగా ఉంది. ఇకపోతే, 18 క్యారెట్ల బంగారం ధర ఒక గ్రాము రూ.7,310లుగా ఉంది. ఢల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.87,690, 24 క్యారెట్ల ధర రూ.95,650 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.87,540, 24 క్యారెట్ల ధర రూ.95,500 గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.87,540, 24 క్యారెట్ల రేటు రూ.95,500 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.87,540, 24 క్యారెట్ల ధర రూ.95,500 గా ఉంది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.87,540, 24 క్యారెట్ల ధర రూ.95,500 గా 4ఉంది. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,340, 24 క్యారెట్ల ధర రూ.97,470 గా ఉంది.

# పొటాష్ మైనింగ్ వైపు భారత్ అడుగులు..



క్లిష్టమైన, వ్యూహాత్మక ఖనిజ బ్లాకుల ఐదో విడత వేలం జనవరి 28న మొదలు కాగా.. తాజాగా అది విజయవంతంగా ముగిసిందని కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రకటించారు. వేలానికి ఉంచిన 15 బ్లాకులలో 10 బ్లాకుల వేలం విజయవంతంగా ముగిసింది. ఈ 10 బ్లాకులలో గ్రాఫైట్, ఫాస్ఫరైట్, ఫాస్ఫేట్ వంటి కీలక ఖనిజాలు ఉన్నాయి. ఖనిజ సంపదలో కీలకమైన మైలురాయిను విజయవంతంగా అధిగమించింది భారత ప్రభుత్వం. తొలిసారిగా పొటాష్‌బ్లాక్ వేలం నిర్వహించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత్ ఖనిజాల అన్వేషణ విజయవంతంగా అడుగులు వేస్తోందని కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. విదేశీ దిగుమతులపై ఆధారపడకుండా, స్వయం సమృద్ధిని సాధిస్తున్నామని మంత్రి తెలిపారు. కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్లిష్టమైన ఖనిజ బ్లాకుల ఐదో విడత వేలం విజయవంతంగా ముగిసింది. వేలానికి ఉంచిన 15 బ్లాకులలో 10 బ్లాకుల వేలం విజయవంతంగా జరిగింది. ఈ 10 బ్లాకులలో గ్రాఫైట్, ఫాస్ఫరైట్, ఫాస్ఫేట్, అరుదైన భూమి మూలకాలు, వనాడియం వంటి కీలకమైన, వ్యూహాత్మక ఖనిజాలు ఉన్నాయి. మొదటిసారిగా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలో విస్తరించి ఉన్న పొటాష్, హాలైట్ ఉన్నాయి. దీనితో, కేంద్ర ప్రభుత్వం వేలం వేసిన మొత్తం బ్లాకుల సంఖ్య 34కి చేరుకుంది. భారత సర్కార్ తొలిసారిగా పొటాష్ బ్లాక్ వేలం నిర్వహించింది. ఇది దేశీయ పొటాష్‌వనరులను వెలికితీయడంలో ఒక ప్రధాన ముందడుగుగా నిలుస్తుంది. దీంతో దేశంలో పొటాష్ మైనింగ్‌ను ఉత్ప్రేరకపరచడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, వ్యవసాయ రంగానికి మద్దతును బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. ఈ మైలురాయి రాజస్థాన్ రాష్ట్రంలో కీలకమైన, వ్యూహాత్మక ఖనిజ బ్లాక్ యొక్క మొట్టమొదటి విజయవంతమైన వేలాన్ని కూడా సూచిస్తుంది. దేశంలో కీలకమైన ఖనిజాల అన్వేషణపై కూడా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలోని గనుల మంత్రిత్వ శాఖ దృష్టి సారించింది. దేశంలో కీలక ఖనిజాలలో స్వయం సమృద్ధిని పెంపొందించడానికి ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా కీలక ఖనిజ బ్లాకులను క్రమం తప్పకుండా వేలం వేస్తోంది. ఇప్పటివరకు వేలానికి ఉంచిన 55 కీలక ఖనిజ బ్లాకులలో 5 విడతలుగా మొత్తం 34 బ్లాకులను విజయవంతంగా వేలం పూర్తి చేశారు. ముఖ్యమైన అంశం ఏమంటే, దేశంలో కీలకమైన ఖనిజ పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి కోసం నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌ను ప్రారంభించింది. కీలక ఖనిజాలలో స్వయం సమృద్ధిని పెంపొందించడానికి వేలంపాటలలో పరిశ్రమ వాటాదారుల విలువైన భాగస్వామ్యం, ఇతర చొరవలను మంత్రిత్వ శాఖ గుర్తించింది. కాగా, ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత్ ఖనిజాల అన్వేషణ అంశంపై విజయవంతంగా అడుగులు వేస్తోందని కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

# ఎల్ఐసి ఫలితాలు భళా..

ప్రభుత్వ రంగంలోని దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2024 25) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 38 శాతం వృద్ధితో రూ.19,013 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.13,763 కోట్ల లాభాలు ప్రకటించింది. మంగళవారం వెల్లడిరచిన ఆర్థిక ఫలితాల రిపోర్ట్ సందర్భంగా డివిడెండ్‌ను ప్రకటించింది. 202425కుగాను తుది డివిడెండ్ కింద ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.12 డివిడెండ్‌ను అందించాలని ఆ సంస్థ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు నిర్ణయించారు. ఇందుకు రికార్డ్ తేదిని జులై 25గా ప్రకటించారు. గడిచిన క్యూ4లో ఎల్ఐసి నికర ప్రీమియం ఆదాయం రూ.1.47 లక్షల కోట్లుగా చోటు చేసుకుంది. ఇంతక్రితం ఏడాది ఇదేసమయంలో రూ.1.52 లక్షల కోట్లుగా ఉంది. 2025 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 18 శాతం వృద్ధితో రూ.48,151 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం 202324లో రూ.40,676 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో రూ.8,53,707 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన 2024 25లో రూ.8,84,148 కోట్లకు చేరింది.







# ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌కు భారీ దెబ్బ

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఒజిఎల్)కు మహారాష్ట్ర రవాణా శాఖ ఊహించని షాక్ ఇచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌కు ఇచ్చిన 5,484 ఎలక్ట్రిక్ బస్సుల టెండర్‌ను రద్దు చేసింది. రూ.10 వేల కోట్ల విలువైన ఈ కాంట్రాక్టులో బస్సుల సరఫరాలో ఆలస్యం జరగడంతో ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు ఆ రాష్ట్ర రవాణ శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ తెలిపారు. గడువులోగా బస్సులు డెలివరీ చేయకపోవడంతో టెండర్ రద్దు చేయాల్సి వచ్చిందని వెల్లడిరచారు. 2024 జనవరిలో ఒలెక్ట్రాతో ఒప్పందం చేసుకున్నామన్నారు. ఇప్పటి వరకు 2,000 బస్సులను డెలివరీ చేయాల్సి ఉందన్నారు. వీటితో ప్రజలకు సేవలందించాలనుకున్నామన్నారు. కానీ ఇప్పటి వరకు ఓలెక్ట్రా కేవలం 220 బస్సులను మాత్రమే అందించిందని ఓ వార్త సంస్థతో పేర్కొన్నారు. "2025 మే వరకు కనీసం 1200 బస్సులను అందిస్తారని భావించాము. ఇంకెంత కాలం ఎదురు చూడాలి. ఇప్పటికే పలు సార్లు నోటీసులు జారీ చేశాము. కాంట్రాక్టు రద్దు కోసం లీగల్ సలహా తీసుకుంటున్నాము.' అని సర్నాయక్ వెల్లడిరచారు. మహారాష్ట్ర రవాణ శాఖ నుంచి భారీ కాంట్రాక్టు రద్దు అయ్యిందన్న వార్తలతో ఒలెక్ట్రా షేర్ భారీగా పతనమయ్యింది. ఇంట్రాడేలో ఏకంగా 14 శాతం క్షీణించి రూ.1,160 స్థాయికి పడిపోయింది. ఆ తర్వాత కొంత కోలుకుని తుదకు 6.65 నష్టంతో రూ.1,255.90 వద్ద ముగిసింది. విద్యుత్ బస్సుల సరఫరాలో విఫలమైన ఒలెక్ట్రాకు ఏడు సార్లు షోకాజు నోటీసులు జారీ చేశారు. ఒప్పంద ఉల్లంఘనలు, ఆలస్యం కారణంగా సుమారు రూ.4 కోట్ల జరిమానాలు కూడా విధించారనే రిపోర్టులు ఆ కంపెనీ షేర్‌పై ప్రతికూలతను పెంచాయి.

# 13 శాతం పెరిగిన ఎన్ఎండీసీ లాభం

ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ 202425 ఆర్థిక సంవత్సరానికి చక్కటి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.23,668 కోట్ల టర్నోవర్‌పై రూ.6,693 కోట్ల నికర లాభం ఆర్జించింది. 202324 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే టర్నోవర్ 11 శాతం, నికర లాభం 13 శాతం పెరిగాయి. మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికంలోనూ కంపెనీ రూ.7,444 కోట్ల టర్నోవర్‌పై రూ.1,496 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే టర్నోవర్ ఎనిమిది శాతం పెరిగినా, నికర లాభం నామమాత్రంగా రెండు శాతం మాత్రమే పెరిగింది. అయినా 202425 ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు ఒక్కో షేరుపై రూపాయి చొప్పున తుది డివిడెండ్‌గా చెల్లించాలని ఎన్ఎండీసీ బోర్డు సిఫారసు చేసింది. ఇంతకు ముందు చెల్లించిన రూ.2.3 మధ్యంతర డివిడెండ్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటే 202425 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ ఒక్కో షేరుపై రూ.3.3 చొప్పున డివిడెండ్ చెల్లించినట్టవుతుంది. రూపాయి ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై ఇది 330 శాతానికి సమానం.

# లక్ష రూపాయల్లో లక్షణమైన ఈవీ బైక్స్..!



భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల రంగం రోజురోజుకూ వృద్ధి చెందుతుంది. పెరుగుతున్న పెట్రోల్ ధరల దెబ్బకు సగటు సామాన్యుడు ఈవీ వాహనాల వినియోగానికి ముందుకు వస్తున్నాడు. అయితే ఈ ఈవీ వాహనాల్లో చాలా మంది ఈవీ స్కూటర్లనే కొనుగోలు చేస్తున్నారు. కానీ తాజాగా మార్కెట్‌లో ఈవీ బైక్‌లు సరసమైన ధరల్లో లాంచ్ కావడంతో వాటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఏప్రిల్ 2025లో రిటైల్ గణాంకాల ఆధారంగా 58 శాతం వాటాతో ఈవీ మార్కెట్‌లో ద్విచక్ర వాహనాలు హల్‌చల్ చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, ప్రయాణికుల వాహనాలు, వాణిజ్య వాహనాలతో సహా మొత్తం ఈవీ విభాగం సంవత్సరానికి 17 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విభాగం మొదటిసారిగా 1 మిలియన్ అమ్మకాలను సాధించింది. అలాగేసంవత్సరానికి 21 శాతం బలమైన వృద్ధిని చూసింది. ఈ విభాగంలో ఎలక్ట్రిక్ స్కూటర్లు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. కానీ మార్కెట్లో ఆల్‌ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లు కూడా అందుబాటులో ఉన్నాయి. రివోల్ట్ మోటార్స్ ఆర్‌వీ1 మోటర్ బైక్ ధర రూ. 90,000గా ఉంటుంది. రివోల్ట్ మోటార్స్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ విభాగంలో అగ్రగామిగా ఉంది. ఈ కంపెనీ ఐదు ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లను అందిస్తుంది. రివోల్ట్ ఆర్‌వీ1, రివోల్ట్ ఆర్‌వీ1o, రివోల్ట్ బ్లేజ్‌ఎక్స్, రివోల్ట్ ఆర్‌వీ400 బీఆర్‌జెడ్, రివోల్ట్ ఆర్‌వీ400. రివోల్ట్ మోటార్స్ లైనప్‌లో అత్యంత సరసమైన వాహనం అయిన రివోల్ట్ ఆర్‌వీ1 నిలుస్తుంది. ఈ బైక్ 2.2 కేడబ్ల్యూహెచ్ లిథియంఅయాన్ బ్యాటరీ సామర్థ్యంతో 2.8 కేడబ్ల్యూహెచ్ మోటారును కలిగి ఉంది. ఆర్‌వీ 12 గంటల 15 నిమిషాల్లో 080 శాతం ఛార్జ్ అవుతుంది. అలాగే ఓ సారి చార్జ్ చేస్తే 100 కి.మీ. లేజ్ ఇస్తుంది. ఈ కంపెనీ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్, బ్యాటరీపై 5 సంవత్సరాలు లేదా 75,000 కి.మీ.ల వారంటీని అందిస్తోంది. అలాగే ఛార్జర్‌పై 2 సంవత్సరాల వారెంటీ అందిస్తుంది. ఒబెన్ రోర్ ఈజెడ్ ఈవీ బైక్ ధర రూ. 90,000గా ఉంది. ఒబెన్ రోర్ ఈజెడ్ బైక్ 2.6 కేడబ్ల్యూహెచ్ 3.4 కేడబ్ల్యూహెచ్, 4.4 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్స్ వస్తుంది. 2.6 కేడబ్ల్యూహెచ్ మోడల్ ధర రూ. 90,000. ఈ బైక్ 52 క్రీన్‌ఎం టార్క్‌తో 7.5 కేడబ్ల్యూహెచ్ అవుట్‌పుట్‌తో వస్తుంది. ఈబైక్ 95 కిలోమీటర్ల వేగతంతో దూసుకుపోతుంది. కేవలం 3.3 సెకన్లలో 0 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఈ బైక్‌ను ఓ సారి చార్జ్ చేస్తే 110 కి.మీ పరిధిని అందిస్తుంది. ఈ బైక్‌ను 2 గంటల్లో 80 శాతం వరకు ఛార్జ్ అవుతుంది. ఈ బైక్‌కు 8 సంవత్సరాలు లేదా 80,000 కి.మీ క్లాస్‌లీడిరగ్ బ్యాటరీ వారంటీ ఉంది. ఓలా రోడ్‌స్టర్ ఎక్స్ ఈవీ బైక్ ధర రూ. 99,999గా ఉంది. ఈ బైక్ మూడు బ్యాటరీ ఎంపికలతో అందుబాటులో ఉంటుంది. 2.5 కేడబ్ల్యూహెచ్, 3.5 కేడబ్ల్యూహెచ్, 4.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఎంపికల్లో ఈ బైక్‌ను కొనుగోలు చేయవచ్చు. 2.5 కేడబ్ల్యూహెచ్ వెర్షన్ ఓ సారి చార్జ్ చేస్తే 140 కి.మీ మైలేజ్ అందిస్తుంది. అలాగే ఈ బైక్ 7 కేడబ్ల్యూ గరిష్ట శక్తిని అందుకుంటుంది. ఛార్జింగ్ విషయానికి వస్తే ఈ బైక్ 6.2 గంటల్లో 0 %% 80 శాతం వరకు చార్జ్ అవుతుంది. ఈ బైక్ కేవలం 3.4 సెకన్లలో 0 %% 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఓలా ఎలక్ట్రిక్ ఈ బైక్‌కు 3 సంవత్సరాలు లేదా 50,000 కి.మీ బ్యాటరీ వారంటీని అందిస్తోంది.



# నాగార్జున అంత పెద్ద రిస్క్ చేస్తారా

సూపర్ స్టార్ రజనీకాంత్ జైలర్ 2లో నాగార్జునని విలన్ గా పరిగణిస్తున్నారనే గాసిప్ అభిమానుల్లో కొత్త డౌట్లు పుట్టిస్తోంది. ఆల్రెడీ కూలీలో నటిస్తుండగా వెంటనే అదే కాంబోలో ఇంకో సినిమా చేయడం నాగ్ కోణంలో చూసుకుంటే రిస్క్ అవుతుంది. ఎందుకంటే వందో మూవీ దగ్గరవుతున్న తరుణంలో ఇప్పటికే ఒకే ఏడాదిలో రెండు స్పెషల్ రోల్స్ చేశారు. కూలి కాకుండా కుబేరలోనూ ఆయన సోలో హీరో కాదు. ఒకదాంట్లో మామ మరొక దాంట్లో అల్లుడు టైటిల్ రోల్స్ చేస్తున్నారు. అలాంటప్పుడు జైలర్ 2లో ప్రతినాయకుడు అంటే ఫ్యాన్స్ నుంచి అంత సానుకూల స్పందన రాకపోవచ్చు. ప్రస్తుతానికిది పుకారనే చెప్పాలి.నా సామిరంగా తర్వాత నాగ్ మళ్ళీ ఒక్కడే హీరోగా కనిపించలేదు. అభిమానుల్లో ఈ అసంతృప్తి ఉంది. కూలి, కుబేర మీద ఎంత బజ్ ఉన్నా వాళ్ళు కోరుకుంటున్నది అలా కాదు. తండేల్ తో నాగ చైతన్య ఫామ్ లోకి వచ్చాడు. లెనిన్ చూస్తుంటే అఖిల్ కు మొదటి సూపర్ హిట్టు దక్కేలా ఉంది. సుమంత్ కు అనగనగా చాలా పేరు తీసుకొస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో నాగార్జున సైతం లైన్ లోకి వచ్చేస్తే అక్కినేని ఫ్యాన్స్ కు పండగే. జైలర్ 2లో విలన్ అంటే దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ చాలా వయొలెంట్ గా డిజైన్ చేసి ఉంటాడు. దానికి నాగ్ ఎంత వరకు రైట్ ఛాయస్ అనేది సులభంగా నిర్ణయించుకునేది కాదు. అసలు కూలిలో కూడా రోలెక్స్ లాంటి క్యారెక్టరైజేషన్ వల్లే నాగ్ ఒప్పుకున్నాడనేది ఎప్పుడో బయటికొచ్చిన మ్యాటర్. దానికి తగ్గట్టే టీజర్ లో ఆయన బ్యాక్ విజువల్ బాగా వైరలయ్యింది. ఫామ్ లోకి వస్తున్న టైంలో జైలర్ 2 లాంటి వాటిలో నెగటివ్ షేడ్స్ ఉన్న రోల్స్ చేయడం అంత సేఫ్ కాకపోవచ్చు.

# ‘థగ్ లైఫ్’ ఒరిజినల్ స్టోరీ ఎవరిది?



నాయగన్.. ఇండియన్ సినిమా హిస్టరీలోనే గ్రేటెస్ట్ ఫిలిమ్స్‌లో ఒకటి. ‘టైమ్’ సంస్థ ప్రకటించిన ప్రపంచ అత్యుత్తమ వంద చిత్రాల జాబితాలో చోటు దక్కించుకున్న ఘనత ఈ సినిమా సొంతం. అంత గొప్ప సినిమాను అందించిన మణిరత్నం, కమల్ హాసన్ జోడీ నుంచి 37 ఏళ్ల పాటు మరో సినిమా రాకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయమే. ఎట్టకేలకు వీరి కలయికలో ‘థగ్ లైఫ్’ రాబోతోంది. జూన్ 5న పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాల మధ్య ఈ చిత్రం విడుదల కానుంది. రిలీజ్ దగ్గర పడుతుండగా.. ఈ సినిమా కథ గురించి దర్శకుడు మణిరత్నం ఆసక్తికర విషయం వెల్లడిరచారు. దీనికి మూల కథ రాసింది కమల్ హాసనేనట. ఆయన కథను తాను మార్చి ‘థగ్ లైఫ్’గా తీసినట్లు ఆయన తెలిపారు.కమల్ ‘అమర్ హై’ పేరుతో రాసిన ఓ స్క్రిప్టును కొన్నేళ్ల ముందు తాను చదివానని.. అందులో ఒక పాయింట్ తనకు బాగా నచ్చిందని మణిరత్నం తెలిపారు. ఆ పాయింట్ పట్టుకుని.. దానికి ‘నాయగన్’ తరహా ట్రీట్మెంట్ ఇచ్చి ‘థగ్ లైఫ్’ కథను తీర్చిదిద్దినట్లు మణిరత్నం వెల్లడిరచారు. కాబట్టి ఈ సినిమాకు మూల కథ క్రెడిట్ కమల్‌కే దక్కుతుందని ఆయన తెలిపారు. సినిమాలో ‘నాయగన్’ ఛాయలు ఉంటాయని ఆయన చెప్పకనే చెప్పేశారు. కమల్ గొప్ప నటుడే కాదు.. మేటి రచయిత, దర్శకుడు కూడా. ‘దశావతారం’, ‘ఉత్తమ విలన్’ సహా పలు చిత్రాలకు ఆయన కథ అందించారు. ‘హే రామ్’,‘విశ్వరూపం’ సహా కొన్ని చిత్రాలను డైరెక్ట్ చేశారు.



# సత్య చితగ్గొట్టేశాడు

టాలీవుల్లో ప్రస్తుతం మాంచి ఊపుమీదున్న కమెడియన్ ఎవరంటే.. సత్య పేరే చెప్పాలి. ఒక ప్రత్యేకమైన కామెడీ టైమింగ్ ఉన్న సత్య.. సరైన పాత్ర పడితే ఎలా చెలరేగిపోతాడో చాలా సినిమాలు రుజువు చేశాయి. ‘మత్తు వదలరా2’ తన కెరీర్‌కు పెద్ద మలుపు అని చెప్పాలి. ఆ సినిమా పెద్ద హిట్ కావడంలో అత్యంత కీలక పాత్ర సత్యదే. తన కామెడీనే సినిమాను డ్రైవ్ చేసింది. కానీ తర్వాత సత్యకు సరైన పాత్రలు పడట్లేదనే అసంతృప్తి ప్రేక్షకుల్లో వ్యక్తమైంది. ఐతే ఇప్పుడు సత్య కామెడీ టైమింగ్‌ను పూర్తిగా వాడుకునే ఒక క్యారెక్టర్ అతడికి దక్కినట్లే కనిపిస్తోంది. అదే.. బెట్టింగ్ భోగి. ఐతే ఈ పాత్ర సినిమాలోనిది కాదు. సత్య తొలిసారిగా నటిస్తున్న ఓ వెబ్ సిరీస్‌లోనిది. అదే.. 3 రోజెస్2. ఆహా ఓటీటీలో త్వరలోనే స్ట్రీమింగ్ కానున్న ఈ సిరీస్ నుంచి సత్య క్యారెక్టర్‌కు సంబంధించిన టీజర్ రిలీజ్ చేశారు. బెట్టింగ్ యాప్స్ తాలూకు దుష్పరిణామాల గురించి ఈ మధ్య ఎంత పెద్ద చర్చ జరిగిందో తెలిసిందే. ప్రభుత్వం బెట్టింగ్ యాప్స్ మీద ఉక్కుపాదం మోపుతున్న తరుణంలో బెట్టింగ్‌కు బానిసైన ఓ కుర్రాడి పాత్రను సత్య కోసం తీర్చిదిద్దారు. ఐతే టాపిక్ సీరియస్ అయినా.. దాన్ని సత్య టైమింగ్‌కు తగ్గట్లు భలే ఫన్నీగా తీర్చిదిద్దారు. ఓ మంచి సందేశాన్ని ఒక కామెడీ క్యారెక్టర్ ద్వారా చెబితే జనాలకు బాగా ఎక్కుతుందనడంలో సందేహం లేదు. ట్రెండీ మీమ్స్‌ను వాడుకుంటూ ఈ పాత్రను చాలా ఫన్నీగా తీర్చిదిద్దినట్లున్నారు మేకర్స్. రెండు నిమిషాల నిడివి ఉన్న టీజర్లో సత్య ప్రతి పంచ్ పేలింది. తన పాత్ర హిలేరియస్‌గా ఉండబోతోందనే సంకేతాలు ఇచ్చింది టీజర్. ‘3 రోజెస్’ ఫస్ట్ సీజన్ ఓ మోస్తరు స్పందన తెచ్చుకుంది. కానీ రెండో సీజన్‌ను కేవలం సత్య కోసమే జనం చూసేలా ఉన్నారు. అంత ఇంట్రెస్టింగ్‌గా టీజర్ కట్ చేసింది టీం.

# కుటుంబ అంశాలు, అన్ని రకాల ఎమోషన్స్‌తో..

ప్రస్తుతం ఉన్న తరుణంలో ఓ ఫ్యామిలీ ఎమోషన్స్, కుటుంబ కథా చిత్రాలు, విలువలను చాటి చెప్పే కథల్ని నిర్మించడం అంటే మామూలు విషయం కాదు. అలాంటి ఓ సం దేశాత్మక చిత్రంగా ‘షష్టిపూర్తి’ సినిమాను రూపేశ్ నిర్మించారు. నిర్మాతగానే కాకుండా హీరోగానూ నటించారు. డా.రాజేంద్ర ప్రసాద్, అర్చ న, ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రల్లో ఈ చిత్రాన్ని పవన్ ప్రభ తెరకెక్కించారు. మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం మే 30న విడుదల కాబోతోంది. ఈ క్రమంలో హీరో, నిర్మాత రూపేశ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చెప్పిన విశేషాలు..ఎక్కువగా ఎంజాయ్ చేశా.. ‘షష్టిపూర్తి’ కథ నాకు చాలా నచ్చింది. ప్రస్తుతం ఇలాంటి కథలే రావడం లేదు. హింసతో కూడిన చిత్రాలే వస్తున్నాయి. ఇలాంటి విలువలతో స్క్రిప్ట్ నా వద్దకు రావడంతో ఎంతో ఆనందించాను. ఇందులో అన్ని రకాల అంశాలుంటాయి. ఈ చిత్రాన్ని నిర్మించడం ఆనందంగానే ఉన్నా.. నటించడాన్ని ఎక్కువగా ఎంజాయ్ చేశాను. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. అన్ని రకాల ఎమోషన్స్‌తో.. ’షష్టిపూర్తి’ పూర్తిగా కల్పిత చిత్రమే. కానీ ఇందులోని పాత్రల్ని చూస్తే ఆడియెన్స్ మాత్రం తమని తాము చూసుకున్నట్టుగా కనెక్ట్ అవుతారు. ప్రస్తుతం అసలు స్వచ్ఛమైన ప్రేమను కూడా చూ పించడం లేదు. ఇందులో కుటుంబ అంశాలతో పాటుగా అన్ని రకాల ఎమోషన్స్‌ను చూపించాం. అలా ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చా.. ఈ కథను రాజేంద్ర ప్రసాద్ కోసమే పవన్ ప్రభ రాసుకున్నారు. ఆయన కొడుకుగా నటించే వారి ది కొత్త మొహం అయితే ఎలాంటి అంచనాలు లేకుండా సినిమాను చూస్తారు.





# నాగ్ డిజాస్టర్ ఇష్టమన్న ధనుష్

జూన్ 20 రాబోతున్న కుబేర మీద విభిన్నమైన అంచనాలున్నాయి. సాఫ్ట్ అండ్ ఎమోషనల్ సినిమాలతో పేరు తెచ్చుకున్న దర్శకుడు శేఖర్ కమ్ముల ఈసారి సీరియస్ డ్రామాని ఎంచుకున్నాడు. గతంలో లీడర్ చేశాడు కానీ అది పూర్తిగా పొలిటికల్ బ్యాక్ డ్రాప్. అయితే ఈసారి క్రైమ్ ని ఎంచుకున్నాడు. సార్ తో తెలుగులోనూ మంచి మార్కెట్ ఏర్పరుచుకున్న ధనుష్ చేస్తున్న రెండో టాలీవుడ్ స్ట్రెయిట్ మూవీ ఇది. రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తుండగా దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ప్రత్యేక ఆకర్షణ కానుంది. ఈ సందర్భంగా ధనుష్ ఇస్తున్న ఇంటర్వ్యూలలో కొన్ని ప్రత్యేక విశేషాలు బయట పడుతున్నాయి. నాగార్జునతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం గురించి ధనుష్ మాట్లాడుతూ తనకు ఇష్టమైన ఆయన సినిమాల్లో రక్షకుడు గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాడు. అప్పట్లో కుంజుమోన్ నిర్మాణంలో భారీ బడ్జెట్ తో రూపొందిన ఈ ప్యాన్ ఇండియా మూవీ మాములు డిజాస్టర్ కాదు. ఏఆర్ రెహమాన్ సంగీతం మినహాయించి కంటెంట్ పరంగా ఆడియన్స్ ని ఏ మాత్రం ఆకట్టుకోలేకపోయిన రక్షకుడు ఆ టైంలో వచ్చిన సూపర్ ఫ్లాప్ గా మీడియాలో చాలా కథనాలొచ్చాయి. దర్శకుడు ప్రవీణ్ గాంధీకి తర్వాత ఒకటి రెండు అవకాశాలు దక్కినా త్వరగా కనుమరుగైపోయాడు. కుంజుమోన్ సైతం నష్టాలు తట్టుకోలేక చాలా కాలం ప్రొడక్షన్ ఆపేశారు. రక్షకుడు వెనుక ఇంత పెద్ద స్టోరీ ఉంది. అయినా సరే ఈ సినిమాలో ఫ్యాన్ మూమెంట్స్ కొన్ని బాగుంటాయి. ముఖ్యంగా విలన్ గ్యాంగ్ ని నాగార్జున వెంటపడి తరిమే ఎపిసోడ్, క్లైమాక్స్ లాంటివి అబ్బురపరుస్తాయి. కాకపోతే కథ కథనాలు సరిగా లేకపోవడంతో జనాలు రిసీవ్ చేసుకోలేదు.


# కుటుంబ అంశాలు, అన్ని రకాల ఎమోషన్స్‌తో..

ప్రస్తుతం ఉన్న తరుణంలో ఓ ఫ్యామిలీ ఎమోషన్స్, కుటుంబ కథా చిత్రాలు, విలువలను చాటి చెప్పే కథల్ని నిర్మించడం అం టే మామూలు విషయం కాదు. అలాంటి ఓ సం దేశాత్మక చిత్రంగా ‘షష్టిపూర్తి’ సినిమాను రూపేశ్ నిర్మించారు. నిర్మాతగానే కాకుండా హీరోగానూ నటించారు. డా.రాజేంద్ర ప్రసాద్, అర్చ న, ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రల్లో ఈ చిత్రాన్ని పవన్ ప్రభ తెరకెక్కించారు. మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం మే 30న విడుదల కాబోతోంది. ఈ క్రమంలో హీరో, నిర్మాత రూపేశ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చెప్పిన విశేషాలు..ఎక్కువగా ఎంజాయ్ చేశా.. ‘షష్టిపూర్తి’ కథ నాకు చాలా నచ్చింది. ప్రస్తుతం ఇలాంటి కథలే రావడం లేదు. హింసతో కూడిన చిత్రాలే వస్తున్నాయి. ఇలాంటి




విలువలతో స్క్రిప్ట్ నా వద్దకు రావడంతో ఎంతో ఆనందించాను. ఇందులో అన్ని రకాల అంశాలుంటాయి.ఈ చి త్రాన్ని నిర్మించడం ఆనందంగానే ఉన్నా.. నటించడాన్ని ఎక్కువగా ఎంజాయ్ చేశాను. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. అన్ని రకాల ఎమోషన్స్‌తో.. ’షష్టిపూర్తి’ పూర్తిగా కల్పిత చిత్రమే. కానీ ఇందులోని పాత్రల్ని చూస్తే ఆడియెన్స్ మాత్రం తమని తాము చూసుకున్నట్టుగా కనెక్ట్ అవుతారు. ప్రస్తుతం అసలు స్వచ్ఛమైన ప్రేమను కూడా చూ పించడం లేదు. ఇందులో కుటుంబ అంశాలతో పాటుగా అన్ని రకాల ఎమోషన్స్‌ను చూపించాం.అలా ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చా.. ఈ కథను రాజేంద్ర ప్రసాద్ కోసమే పవన్ ప్రభ రాసుకున్నారు. ఆయన కొడుకుగా నటించే వారి ది కొత్త మొహం అయితే ఎలాంటి అంచనాలు లేకుండా సినిమాను చూస్తారు.




# ఒక సినిమా 2 క్లైమాక్సులు

జూన్ 6 విడుదల కాబోతున్న బాలీవుడ్ మల్టీస్టారర్ హౌస్ ఫుల్ 5 దర్శక నిర్మాతలు ఒక వెరైటీ ప్రయోగం చేశారు. రెండు క్లైమాక్స్ లు షూట్ చేసి కొన్ని థియేటర్లలో ఒకటి, ఇతర స్క్రీన్లలో వేరొకటి ప్రదర్శించబోతున్నారు. ప్రపంచంలోనే ఇది మొదటిసారని ఇవాళ ట్రైలర్ లాంచ్ లో చెప్పడం చూసి అందరూ షాక్ తిన్నారు. రెండు వెర్షన్లకు సెన్సార్ విడివిడిగా చేయించడం విశేషం. అయితే ఎక్కడ ఏ క్లైమాక్స్ ఉందో సినిమా చూస్తే కానీ తెలియదట. ఉదాహరణకు ప్రసాద్ మల్టీప్లెక్స్ లో ఎండిరగ్ ఒకలా ఉంటే దానికి దగ్గర్లో ఉండే పివిఆర్ పంజాగుట్టలో ఇంకోలా ఫినిషింగ్ ఉంటుందన్న మాట. రెండు షోలు చూస్తేనే తేడా తెలుస్తుంది.ఇలా ఎందుకు చేశారంటే కిక్కు కోసమని రవితేజ స్టైల్ లో చెబుతున్నారు. నిజానికి ఇలా రెండు క్లైమాక్స్ లు తీయడం ఇదేం మొదటిసారి కాదు. ఆల్ టైం క్లాసిక్ షోలే చివరి ఘట్టాన్ని రెండు రకాలుగా తీశారు. ఒకదాంట్లో అంజాద్ ఖాన్ ని సంజీవ్ కుమార్ చంపే సీన్ ఉంటే మరొకటి అంజాద్ ఖాన్ ని పోలీసులు అరెస్ట్ చేసినట్టుగా ఉంటుంది. సెన్సార్ అభ్యంతరం మేరకు రెండోదాన్ని లాక్ చేశారు నిర్మాత. యూట్యూబ్ లో ఈ వ్యత్యాసం చూడొచ్చు. కృష్ణ, నాగార్జున కలయికలో వచ్చిన వారసుడులో ముందు కృష్ణ చనిపోయినట్టుగా చూపిస్తారు. ఫ్యాన్స్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో తర్వాత హ్యాపీ ఎండిరగ్ గా మార్చేశారు. ఇలా పలు ఉదాహరణలున్నాయి కానీ హౌస్ ఫుల్ 5 మాత్రం వీటికి భిన్నంగా ప్లాన్ చేసింది. అక్షయ్ కుమార్, అభిషేక్ బచ్చన్, రితీష్ దేశముఖ్, జాక్వలిన్ ఫెర్నాండేజ్, జాకీ ష్రాఫ్, నానా పాటేకర్, జానీ లివర్, నర్గిస్ ఫక్రే, సోనమ్ బాజ్వా, ఫర్దీన్ ఖాన్, డినో మోరియా ఇలా చాలా పెద్ద క్యాస్టింగ్ నటించిన ఈ కామెడీ ఎంటర్టైనర్ కు తరుణ్ మన్సుఖని దర్శకత్వం వహించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కోహ్లితోనే మైండ్ గేమ్స్ ఆడిన సంతకాల స్టార్!

ఐపీఎల్‌లో దిగ్వేష్ సింగ్ రఠీ తన ప్రత్యేకమైన సెలబ్రేషన్స్‌తో పాపులర్ అయ్యాడు. కోహ్లితో జరిగిన సంఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బౌలింగ్ చేస్తున్నప్పుడు కోహ్లిని ఉద్దేశించి చేసిన చర్య మైండ్ గేమ్స్ అని కొందరు అభిప్రాయపడుతుండగా, మరికొందరు గౌరవంగా భావిస్తున్నారు. ఐపీఎల్‌లో సంతకాల స్టార్, సైనింగ్ స్టార్ ఎవరంటే..? లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్ దిగ్వేష్ సింగ్ రఠీ అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తన ప్రదర్శన కంటే కూడా తన సంతకాల సెలబ్రేషన్స్, ఫైన్స్‌తోనే అతను ఎక్కువ ఫేమస్ అయ్యాడు. అఫ్‌కోర్స్ బౌలింగ్ కూడా చాలా బాగా వేశాడు. కానీ, సైనింగ్ సెలబ్రేషన్స్, అభిషేక్ శర్మతో గొడవ, ఒక మ్యాచ్ నిషేధంతో రఠీ పేరు మారుమోగిపోయింది. తనకొచ్చిన ఐపీఎల్ ప్రైజ్ కంటే కూడా ఫైన్ ఎక్కువ కట్టాడంటూ అతనిపై జోకులు కూడా బాగానే పేలాయి. ఈ ప్లేయర్ మంగళవారం ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో కూడా తన స్లెడ్జింగ్ స్కిల్స్ చూపించే ప్రయత్నం చేశాడు. అది కూడా విరాట్ కోహ్లి ముందు. ఆర్సీబీ బ్యాటింగ్ చేస్తున్న క్రమంలో అప్పటికే కోహ్లి హాఫ్ సెంచరీ చేసి మంచి ఊపులో ఉన్నాడు. సరిగ్గా అదే టైమ్‌లో బౌలింగ్ వేసేందుకు వచ్చిన దిగ్వేష్.. బౌలింగ్ వేస్తూ సరిగ్గా బాల్ రిలీజ్ చేసే టైమ్‌లో ఆగిపోయాడు. కోహ్లి అలాగే చూస్తూ నిల్చుండి పోయాడు. దిగ్వేష్ కూడా కోహ్లి కళ్లలోకి సీరియస్‌గా చూసే ప్రయత్నం చేశాడు. కానీ, అక్కడుంది కోహ్లిని తేరుకొని.. లేదు లేదు.. అక్కడేదో తనను డిస్టబ్ చేసినట్లు కవర్ చేశాడు. దానికి కోహ్లి నవ్వేయడంతో అంతా హమ్మయ్యా అనుకున్నారు. నిజానికి కోహ్లి కాన్సన్‌ట్రేషన్‌ను దెబ్బతీసేందుకు దిగ్వేష్ మైండ్ గేమ్స్ ఆడినట్లు చాలా మంది అభిప్రాయపడుతున్నారు. కానీ, కొన్ని రోజుల క్రితం అందరితో చేసినట్లే కోహ్లితో కూడా ఇలానే చేస్తావా అని ఓ ఇంటర్వ్యూలో దిగ్వేష్‌ను అడగ్గా.. చేయని అని తల అడ్డంగా ఊపాడు. అది కోహ్లికి తనకున్న భయమో, గౌరవమో తెలియదు కానీ.. ఆర్సీబీపై దిగ్వేష్ ఎలాంటి అతి చేయలేదు. జితేష్ శర్మను అవుట్ చేసి నేలపై సంతకం చేస్తూ సెలబ్రేట్ చేసుకున్నప్పటికీ అది నో బాల్ కావడంతో.. చెక్ బౌన్స్ అయిందంటూ అంత దిగ్వేష్‌ను సరదాగా ట్రోల్ చేశారు. అయితే.. కోహ్లితో జరిగిన ఈ చిన్న సంఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.




# తొలి మ్యాచ్‌కి ముందే టీమిండియాకు బిగ్ షాక్..?

ఇంగ్లాండ్‌కు వెళ్లే భారత టెస్ట్ జట్టులో పలువురు ఆటగాళ్లు (యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, నితీష్ కుమార్ రెడ్డి, శార్దూల్ ఠాకూర్ వంటివారు) ఇప్పటికే అక్కడకు చేరుకుని పరిస్థితులకు అలవాటు పడుతున్నారు. ఐపీఎల్ తర్వాత రెడ్‌బాల్ క్రికెట్‌కు మారడానికి, ఇంగ్లాండ్ పరిస్థితులకు అలవాటు పడటానికి ఈ వార్మప్ మ్యాచ్‌లు కీలకం. ఇంగ్లాండ్‌తో జరగనున్న కీలకమైన టెస్ట్ సిరీస్‌కు ముందు టీమిండియాకు ఓ షాక్ తగలనుంది. భారత టెస్ట్ జట్టుకు కొత్త కెప్టెన్‌గా నియమితుడైన శుభ్‌మన్ గిల్.. రెండవ వార్మప్ మ్యాచ్‌కు దూరమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ 2025 ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడం, ఫైనల్ మ్యాచ్ తేదీ దీనికి ప్రధాన కారణం. భారత జట్టు ఇంగ్లాండ్ లయన్స్‌తో మే 30 నుంచి రెండు నాలుగు రోజుల వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. రెండవ వార్మప్ మ్యాచ్ జూన్ 6న నార్తాంప్టన్‌లో జరగనుంది. ఈ మ్యాచ్‌లో గిల్ ఇండియా 'ఎ' జట్టులో భాగం కావాల్సి ఉంది. అయితే, గిల్ నాయకత్వంలోని గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ 2025 ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. ఐపీఎల్ ఫైనల్ జూన్ 3న జరగనుంది. ఒకవేళ గుజరాత్ టైటాన్స్ ఫైనల్‌కు అర్హత సాధిస్తే, జూన్ 3న ఫైనల్ ఆడి, జూన్ 6న వార్మప్ మ్యాచ్ ఆడటం గిల్‌కు చాలా కష్టమవుతుంది. దీంతో, టీమ్ మేనేజ్‌మెంట్ గిల్‌కు కొంత విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. సుదీర్ఘమైన 46 రోజుల ఇంగ్లాండ్ పర్యటనకు ముందు, గిల్ పూర్తిగా విశ్రాంతి తీసుకోవడం అవసరమని బీసీసీఐ భావిస్తోంది. అందుకే, అతను రెండవ వార్మప్ మ్యాచ్‌కు దూరంగా ఉండే అవకాశం ఉందని అంటున్నారు. రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయిన నేపథ్యంలో, 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్ భారత టెస్ట్ జట్టుకు 37వ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. అతని నాయకత్వంలోనే భారత జట్టు ఇంగ్లాండ్‌తో జూన్ 20న హెడ్డింగ్లీలో ప్రారంభమయ్యే ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్, అలాగే కొన్ని టీ20 మ్యాచ్‌లలో భారత జట్టుకు నాయకత్వం వహించిన అనుభవం గిల్‌కు ఉంది. అయితే టెస్టుల్లో కెప్టెన్‌గా అతనికి ఇదే మొదటిసారి. ఇంగ్లాండ్‌కు వెళ్లే భారత టెస్ట్ జట్టులో పలువురు ఆటగాళ్లు (యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, నితీష్ కుమార్ రెడ్డి, శార్దూల్ ఠాకూర్ వంటివారు) ఇప్పటికే అక్కడకు చేరుకుని పరిస్థితులకు అలవాటు పడుతున్నారు. ఐపీఎల్ తర్వాత రెడ్‌బాల్ క్రికెట్‌కు మారడానికి, ఇంగ్లాండ్ పరిస్థితులకు అలవాటు పడటానికి ఈ వార్మప్ మ్యాచ్‌లు కీలకం. గిల్ దూరమైనప్పటికీ, ఇతర ఆటగాళ్లకు ఇది మంచి అవకాశం అవుతుంది. గిల్, సాయి సుదర్శన్ వంటి ఆటగాళ్లు మాత్రం ఐపీఎల్ ఫైనల్ ముగిసిన తర్వాతే జట్టులో చేరనున్నారు. జూన్ 20 నుంచి ప్రారంభమయ్యే ప్రధాన సిరీస్‌కు ముందు గిల్ విశ్రాంతి తీసుకుని, మంచి మానసిక, శారీరక స్థితితో సిద్ధమవుతాడని ఆశిద్దాం.



## పంత్ శాలరీ భారీగా కోత పడిరదిగా..
## చేతికందేది ఎంతో తెలిస్తే షాకే?

ఒక ఆటగాడు టోర్నమెంట్‌కు ముందు గాయపడి, సీజన్ మొత్తం దూరమైతే, అతనికి ఎలాంటి చెల్లింపు ఉండదు. అయితే, టోర్నమెంట్ మధ్యలో గాయపడితే, ఆడిన మ్యాచ్‌ల సంఖ్య ఆధారంగా లేదా పూర్తి జీతం చెల్లించే విధానాలు కూడా ఫ్రాంచైజీల ఒప్పందంపై ఆధారపడి ఉంటాయి. ఐపీఎల్ 2025 మెగా వేలంలో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు రిషబ్ పంత్‌ను రూ. 27 కోట్లకు కొనుగోలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన ఆటగాడిగా పంత్ నిలిచాడు. అయితే, పంత్‌కు ఈ మొత్తం రూ. 27 కోట్లు పూర్తిగా చేతికి అందవు అని మీకు తెలుసా. ప్రస్తుతం ఐపీఎల్ లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాయి. ప్లే ఆఫ్స్ రేపట నుంచి మొదలుకానున్నాయి. అయితే, రిషబ్ పంత్ కెప్టెన్సీలోనే లక్నో సూపర్ జెయింట్స్ టీం ప్లే ఆఫ్ చేరుకోలేకపోయింది. దీంతో పంత్ శాలరీపైనా ఎఫెక్ట్ పడిరదంటూ నెటిజన్లు మాట్లాడుకుంటుకున్నారు. భారత ప్రభుత్వం విధించే ఆదాయపు పన్ను నిబంధనల ప్రకారం, ఐపీఎల్ ఆటగాళ్ల జీతాలపై పన్ను విధించబడుతుంది. పంత్ అందుకునే రూ. 27 కోట్ల జీతంపై 30 శాతం ఆదాయపు పన్ను, 25 శాతం సర్ఛార్జ్ (కొన్ని సందర్భాలలో), 4 శాతం సెస్ వర్తిస్తాయి. ఈ పన్నులు, సెస్సులు పోను పంత్ చేతికి వచ్చే మొత్తం దాదాపు రూ. 16.47 కోట్ల నుంచి రూ. 18.9 కోట్లు వరకు ఉండవచ్చు. ఆటగాళ్ల జీతాలపై 30% ఆదాయపు పన్ను వసూలు చేస్తారు. అంటే, రూ. 27 కోట్లలో దాదాపు రూ. 8.06 కోట్లు ఆదాయపు పన్నుకే చెల్లించాల్సి ఉంటుంది. సర్ఛార్జ్ పంత్ వంటి అధిక ఆదాయం ఉన్న ఆటగాళ్లకు వర్తించే సర్ఛార్జ్ 25% వరకు ఉంటుంది. ఇది పన్ను మొత్తానికి అదనంగా విధిస్తారు. సెస్ విద్యా సెస్, ఆరోగ్య సెస్ వంటివి కూడా వర్తిస్తాయి. ఇవి సుమారు 4% వరకు ఉంటాయి. ఈ పన్నులు, సెస్సులు అన్నీ కలిపి తీసివేస్తే, పంత్‌కు చేతికి వచ్చే మొత్తం గణనీయంగా తగ్గుతుంది. ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఆటగాళ్ల జీతాలను ఒకేసారి చెల్లించవు. సాధారణంగా, 15-65-20 ఫార్ములాను అనుసరిస్తుంటాయి. అయితే, బీసీసీఐ నిబంధనల ప్రకారం, ఫ్రాంచైజీలు తమ సౌలభ్యాన్ని బట్టి ఒకేసారి లేదా రెండు, మూడు వాయిదాలలో పూర్తి జీతాన్ని చెల్లించవచ్చు. కాగా, మీడియా నివేదికల ప్రకారం, రిషబ్ పంత్ ఐపీఎల్ జీతం రూ. 15.52 కోట్లుగా ఉంటుందని చెబుతున్నారు. రిషబ్ పంత్ ప్రయాణం, బస, మేనేజర్ ఫీజులు మొదలైన భాగాలను విడిగా క్లెయిమ్ చేస్తే దాదాపు రూ.1 కోటి పన్ను ఆదా చేయవచ్చు. ఈ సందర్భంలో అతని జీతం రూ.16.47 కోట్లు అవుతుందని చెబుతున్నారు. ఒక ఆటగాడు టోర్నమెంట్‌కు ముందు గాయపడి, సీజన్ మొత్తం దూరమైతే, అతనికి ఎలాంటి చెల్లింపు ఉండదు. అయితే, టోర్నమెంట్ మధ్యలో గాయపడితే, ఆడిన మ్యాచ్‌ల సంఖ్య ఆధారంగా లేదా పూర్తి జీతం చెల్లించే విధానాలు కూడా ఫ్రాంచైజీల ఒప్పందంపై ఆధారపడి ఉంటాయి. భారత ఆటగాళ్లు టీమిండియా తరపున ఆడుతూ గాయపడితే, బీసీసీఐ బీమా పాలసీ ప్రకారం పూర్తి జీతం పొందుతారు. కాబట్టి, రిషబ్ పంత్ రూ. 27 కోట్లకు కొనుగోలు చేయబడినప్పటికీ, పన్నుల భారం, చెల్లింపు విధానాల కారణంగా అతని చేతికి వచ్చే మొత్తం వేలం ధర కంటే గణనీయంగా తక్కువగా ఉంటుంది.





# గుల్వీర్ సింగ్‌కు స్వర్ణం

అసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత్ బోణి కొట్టింది. తొలిరోజే గుల్వీర్ సింగ్ స్వర్ణ పతకంతో మెరిశాడు. పురుషుల 10వేల మీటర్ల పరుగును 28 నిమిషాల 38 నిమిషాల 63 సెకన్లలో ముగించి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ క్రమంలోనే గుల్వీర్ జాతీయ రికార్డు కూడా నెలకొల్పాడు. మెబుకి సుజుకీ(జపాన్) 28 నిమిషాల 43 నిమిషాల 84 సెకన్లతో ముగించి రజత పతకం, ఆల్బర్ట్ కిబిచి రోప్(బహ్రెయిన్) 28 నిమిషాల 46.82 సెకన్లతో కాంస్య పతకం గెలుచుకున్నాడు. తద్వారా ఈ టోర్నీ 10 వేల పరుగులో స్వర్ణం సాధించిన మూడో భారతీయుడిగా గుల్వీర్ రికార్డు నెలకొల్పాడు. అతడి కంటే ముందు హరి చంద్(1975), జీ. లక్ష్మణన్(2017)లు ఆసియా చాంపియన్‌షిప్స్‌లో పసిడితో పోడియం మీద భారత పతాకాన్ని రెపరెపలాడిరచారు. గుల్వీర్ సింగ్ మరో పతకం సాధించే అవకాశం కూడా ఉంది. 30న జరిగే పురుషుల 5వేల మీటర్ల ఫైనల్లో అతను పాల్గొననున్నాడు. 5 వేల మీటర్ల రేసులో గుల్వీర్‌కు మంచి రికార్డు ఉంది. ఇక పురుషుల 20 కి.మీ నడకలో సెర్విన్ సెబాస్టియన్ 1 గంట 21 నిమిషాల 13.60 సెకన్లు కాంస్యం సాధించాడు. చైనాకు చెందిన వాంగ్ జావోజావో 1 గంట 20 నిమిషాల 36.90 సెకన్లు స్వర్ణ పతకం అందుకోగా.. జపాన్‌కు చెందిన కెంటో యోషికావా 1 గంట 20 నిమిషాల 44.90 సెకన్లు రజతం దక్కించుకున్నాడు. మహిళల జావెలిన్‌త్రోలో అన్నురాణి తృటిలో కాంస్యం పతకం చేజార్చుకుంది. అన్నురాణి బెస్ట్ త్రో 58.30 మీటర్లు కాగా.. 64 సెంటీమీటర్ల తేడాతో నాలుగో స్థానంలో నిలిచి మెడల్‌ను మిస్ చేసుకుంది. జపాన్‌కు చెందిన సే టకేమోటో (58.94 మీటర్లు) కాంస్య పతకం సాధించింది. సు లింగ్డాన్ (చైనా.. 63.29 మీటర్లు) స్వర్ణం, మోమోన్ ఉడా (జపాన్.. 59.39 మీటర్లు) రజత పతకాలు అందుకున్నారు.

# రెండో రౌండ్‌కు సింధు, ప్రణయ్

సింగపూర్ ఓపెన్ సూపర్750లో భారత బ్యాడ్మింటన్ స్టార్లు పివి సింధు, హెచ్‌ఎస్ ప్రణయ్ ముందంజ వేయగా.. కిరణ్ జార్జ్, ప్రియాన్షు రాజ్‌వత్ తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. మహిళల సింగిల్స్‌లో పివి సింధు 2114, 219తో కెనడా షట్లర్ వాంగ్‌ను చిత్తు చేసింది. ఇక పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ తనకంటే మెరుగైన ర్యాంకర్ డెన్మార్క్‌కు చెందిన రస్మస్ జెమ్కేపై 1921, 2116, 2114తో మూడు సెట్ల హోరాహోరీ పోరులో విజయం సాధించాడు. తొలి గేమ్ కోల్పోయిన ప్రణయ్.. వరుసగా రెండు సెట్లలో పైచేయి సాధించి విజేతగా మ్యాచ్ ముగించాడు. తదుపరి రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టోఫ్ పొపోవ్‌ను ప్రణయ్ ఎదుర్కోనున్నాడు. ఇతర పోటీల్లో మాళవికా బన్సోద్, అన్మోల్ ఖార్బ్, ప్రియాన్ష్ రజావత్, కిరణ్ జార్జ్‌లు తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. మలేషియా మాస్టర్స్‌లో తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన పీవీ సింధు ఈసారి అదరగొట్టింది. సింధు రెండో రౌండ్‌లో టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన చెన్ యూ ఫెయా (చైనా)తో తలపడనుంది. గత సీజన్ నుంచి ఒక్క టైటిల్ గెలుపొందని సింధు.. సింగపూర్ ఓపెన్‌లో విజేతగా నిలవాలనే కసితో ఉంది.





# సాత్విక్‌–చిరాగ్ జోడీ బోణీ

మూడు నెలల విరామం అనంతరం బరిలోకి దిగిన భారత స్టార్ బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో బోణీ కొట్టింది. వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బుధవారం సాత్విక్-చిరాగ్ జోడీ 21-16, 21-13 చూంగ్ హోన్ జియాన్-మొహమ్మద్ హైకాల్ (మలేసియా) జంటపై గెలుపొందింది. 37 నిమిషాల పాటు సాగిన పోరులో ప్రపంచ మాజీ నంబర్‌వన్ ద్వయం వరుస గేమ్‌ల్లో విజయం సాధించింది.

చిరాగ్ గాయం కారణంగా ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ నుంచి తప్పుకున్న ఈ జంట... పూర్తి ఫిట్‌నెస్‌తో కోర్టులో సత్తా చాటింది. ప్రస్తుతం ప్రపంచ 27వ ర్యాంక్‌లో ఉన్న సాత్విక్-చిరాగ్ జోడీకి... 41వ ర్యాంకర్ మలేసియా జోడీపై ఇది రెండో విజయం. ఈ సీజన్‌లో మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్‌లో సెమీస్‌కు చేరిన ఈ జంట... ఆ తర్వాత గాయాల కారణంగా ప్రధాన టోర్నీలకు దూరమైంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in